గురువారం
04-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 44
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

# ఉచితాలపై నిష్పాక్షిక కమిటీ

- అధికార-విపక్షాలు కలిసి పరిష్కారాన్ని కనుగొనాలి
- వారంలోగా సూచనలు చేస్తే.. తగు ఆదేశాలిస్తాం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఎన్నికల వేళల్లో రాజకీయ పార్టీలు ఉచిత హామీలు గుప్పించడం సర్వసాధారణం. రాజకీయ పార్టీలు వీటికి అలవాటు పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో 'ఉచితాల'పై పార్లమెంటులో చర్చ సమర్థవంతంగా జరుగుతుందా అన్న సందేహం కలగక మానదు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే నిష్పాక్షికంగా వ్యవహరించగల అత్యున్నత కమిటీ అవసరం అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఎన్నికల వేళ పార్టీల ఉచిత హామీల వ్యవహారాన్ని సీజేఐ ఎన్వీ రమణ నేతృత్వ ధర్మాసనం విచారించింది. అధికార-విపక్షాలతో పాటు నీతిఆయోగ్, ఆర్బీఐ వంటివి కలిసికట్లుగా దీనికి పరిష్కారాన్ని కనుగొనాలని, పర్యవేక్షణ కమిటీకి పార్టీలు సిఫార్సు చేయాలని, వారంలోగా సిఫార్సుల ప్రక్రియను పూర్తి చేస్తే తదనుగుణంగా ఉత్తర్వులను జారీ చేస్తామని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. తదుపరి విచారణను వచ్చే గురువారానికి వాయిదా వేసింది. అంతకుముందు కేంద్రం తరపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. రాజకీయ పార్టీల ఉచిత హామీలు ఆర్థిక విధ్వంసానికి దారి తీస్తున్నట్లు తెలిపారు. ఈ పద్ధతికి అంతం పలకడానికి మద్దతిస్తామని మెహతా అన్నారు. ఈ సమస్యపై దృష్టి పెట్టాలని భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ)కు సూచించాలని కోరారు. ఈసీఐ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అభ్యంతరం వ్యక్తం

- మిగతా 2 లో

# నిర్వాసితులను నిండా ముంచారు

- పోలవరం ప్రధాన డ్యామ్ ఎప్పుడు కడతారు?
- పరిహారం చెల్లించేది ఎప్పుడు?
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గందరగోళం సృష్టిస్తున్నాయి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- 8న విజయవాడలో అఖిలపక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం
- ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించిన సీపీఐ రాష్ట్ర ప్రతినిధి బృందం

పోలవరం ప్రాజెక్టు వద్ద ఎస్ఈ నుంచి వివరాలు తెలుసుకుంటున్న రామకృష్ణ, రావుల వెంకయ్య, మధు, సుబ్బారావు, వనజ తదితరులు

విశాలాంధ్ర-పోలవరం: పోలవరం ప్రాజెక్టులో ప్రధాన డ్యామ్‌ను ఎక్కడ, ఎప్పుడు కడతారు, నిర్వాసితులకు పరిహారం ఎప్పుడు చెల్లించి, వారి బాధలు తీరుస్తారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర ప్రతినిధి బృందం బుధవారం ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శించింది. ఈ సందర్భంగా సీపీఐ ప్రతినిధి బృందానికి ప్రాజెక్టులోని స్పిల్ వే, కాఫర్ డ్యామ్ గురించి, వరద ప్రవాహం పై ఎస్ఈ కె.నరసింహ మూర్తి వివరించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులను వరదలలో ముంచేశారని ధ్వజమెత్తారు. ప్రాజెక్టులో ప్రధాన డ్యామ్ ఈసీఆర్ఎఫ్ ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య నీళ్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. నిర్వాసితులను గాలికి వదిలేశారని విమర్శించారు. దీనిపై అఖిలపక్షాలతో ఈనెల 8న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తునట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురోభివృద్ధికి వరప్రసాదమని, లక్షలాది ఎకరాలకు సాగునీరు, వేలాది గ్రామాలకు తాగు నీరు, 960 మెగా వాట్ల జల విద్యుత్ ఈ ప్రాజెక్టు ద్వారా అందుబాటులోకి వస్తాయన్నారు. విశాఖపట్నానికి 22 టీఎంసీల నీరు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి కావలసిన నీరు, రాయలసీమ, కృష్ణా డెల్టాలకు సమృద్ధిగా నీరు అందించగల సత్తా పోలవరం ప్రాజెక్టు సొంతమని రామకృష్ణ అన్నారు. దీని నిర్మాణం పై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 2021 జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు ఇస్తామని వాగ్దానం చేశారు. కానీ ఇప్పటి వరకూ ప్రధాన డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మాణం ప్రారంభం కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందని, దీని నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర అంగీకారంతో కాంటూరును తగ్గిస్తామని, నిర్వాసితుల సంఖ్యను తగ్గిస్తామని అంటున్నాయని, అయితే ఈ రెండు ప్రభుత్వాలు ప్రాజెక్టును పూర్తిచేయకుండా ప్రజలలో గందరగోళం సృష్టిస్తున్నాయని రామకృష్ణ విమర్శించారు.

**వరద బాధితులకు రూ.2 వేలతో సరా...!**

నిర్వాసితుల త్యాగాల ఫలితంగా ఇక్కడ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందన్నారు. నిర్వాసితులు ఇళ్లు, పొలాలు, ఊళ్లు కోల్పోతున్నారని, వారిని వరదలలో ముంచేశారని ధ్వజమెత్తారు. 21 రోజుల పాటు విద్యుత్ లేదని, పశువులకు మేత లేదని, బాధితుల పిల్లలకు సరిగా పాల ప్యాకెట్లు కూడా సరఫరా చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణా ప్రభుత్వం వరద బాధితులకు కుటుంబానికి రూ.10 వేలు ఇస్తే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.2 వేలు ఇచ్చి

- మిగతా 2 లో

# ప్రమాదకర తీర్పు

- మనీలాండరింగ్ నిరోధక చట్టానికి సుప్రీం ఆమోదంపై 17 ప్రతిపక్ష పార్టీల వ్యతిరేకత
- ఈడీ వంటి సంస్థలకు మరిన్ని అధికారాలపై అభ్యంతరం
- 'రాజకీయ ప్రతీకారానికి' బలాన్నిస్తుందని ఆందోళన
- తీర్పును సమీక్షించాలని ఉమ్మడి ప్రకటనలో అభ్యర్థన

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వంటి సంస్థలకు మరిన్ని అధికారాలు కల్పిస్తూ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ)కి 2019లో చేసిన సవరణలను సమర్థిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును 17 ప్రతిపక్ష పార్టీలు 'ప్రమాదకరమైనది'గా అభివర్ణించాయి. ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకొని 'రాజకీయ ప్రతీకారానికి' పాల్పడే ప్రభుత్వ చేతులను ఈ తీర్పు బలోపేతం చేస్తుందని, ఈ ప్రమాదకరమైన తీర్పు స్వల్పకాలికంగానే ఉంటుందని, త్వరలో రాజ్యాంగ నిబంధనలు అమలులోకి వస్తాయని తాము ఆశిస్తున్నామని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, ఎన్‌సీపీ, శివసేన, సీపీఐ, సీపీఎం, సమాజ్ వాదీ పార్టీ, ఆర్జేడీ, ఐయూఎంఎల్, ఆర్ఎస్‌పీ, ఎండీఎంకే, ఆర్ఎల్‌డీ, ఇతరులు సంతకం చేసిన ఒక ఉమ్మడి ప్రకటన పేర్కొంది. 'ఈ సవరణల్లో కొన్నింటిని ఆర్థిక చట్టం ద్వారా అమలు చేయవచ్చో లేదో పరిశీలించకుండానే, మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002కి చేసిన సవరణలను పూర్తిగా సమర్థిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు దీర్ఘకాలిక పరిణామాలపై మా తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నాము' అని వివరించాయి. 'మేము సుప్రీం కోర్టు పట్ల ఎల్లప్పుడూ గౌరవమర్యాదలు కలిగి ఉంటాము. అయినప్పటికీ సవరణలు చేయడానికి ఆర్థిక చట్టం మార్గం రాజ్యాంగబద్ధతను పరిశీలించడానికి ఒక పెద్ద బెంచ్ తీర్పు కోసం వేచి ఉండాలని మేము సూచించవలసి వచ్చింది' అని పేర్కొన్నాయి. 'మనీలాండరింగ్, దర్యాప్తు సంస్థలకు సంబంధించి చాలా సవరించిన చట్టాలను ఉపయోగించడం ద్వారా తమ రాజకీయ ప్రత్యర్థులను దురుద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడానికి ఈ సుదూర సవరణలు ప్రభుత్వ హస్తాలను బలోపేతం చేశాయి' అని తెలిపారు. 'ఆ చట్టానికి సంబంధించి పరిశీలనలు లేకుండానే అత్యున్నత న్యాయ వ్యవస్థ ఒక స్వతంత్ర తీర్పు ఇవ్వడం మమ్మల్ని నిరాశకు గురిచేసింది. చట్టంలోని క్రూరమైన సవరణలకు కార్యనిర్వాహకుల వాదనలను ఇది వాస్తవంగా ప్రతిబింబించింది. ప్రమాదకరమైన తీర్పు స్వల్పకాలికంగా ఉంటుందని, త్వరలో రాజ్యాంగ నిబంధనలు అమలులోకి వస్తాయని మేము ఆశిస్తున్నాము' అని తమ ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నాయి.

దాదాపు 250 పిటిషన్ల ద్వారా సవాలు చేసిన సవరించిన చట్టం ప్రకారం ఈడీకి ఇచ్చిన విస్తృత శ్రేణి అధికారాల చెల్లుబాటును జులై 27న సుప్రీం కోర్టు సమర్థించింది. అలాగే అరెస్టు చేసే అధికారాలు, 'నేర రాబడి' అస్పష్టమైన నిర్వచనాన్ని దుర్వినియోగం చేయవచ్చనే కీలక వాదనలను కోర్టు తిరస్కరించింది. 'టీఎంసీ, ఆప్ సహా 17 ప్రతిపక్ష పార్టీలు, రాజ్యసభ స్వతంత్ర ఎంపీ ఒకరు పీఎంఎల్ఏ 2002కి సవరణలను సమర్థిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు దీర్ఘకాలిక

- మిగతా 2 లో

# తరగతుల విలీనమే...

- ఇంటి పక్కనే పాఠశాల ఉండాలంటే ఎలా?
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాఠశాలల విలీనం జరగలేదని, కేవలం తరగతుల విలీనమే జరిగిందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం పది సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల విడుదల అనంతరం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ విద్యావిధానంలో మార్పుల ప్రకారమే విలీనం ఉంటుందన్నారు. 5,800 పాఠశాలలను మ్యాపింగ్ చేసి విలీనం చేశామని వివరించారు. విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నప్పుడు కొన్ని

- మిగతా 2 లో

పది సప్లిమెంటరీలో 64.23 శాతం ఉత్తీర్ణత 2 లో

# ఇదీ లోకం!

పరిస్థితులు బాగలేక మాటతప్పి మడమతిప్పాల్సి వచ్చింది చెల్లెమ్మా!

# అయ్యో... ఆకలి!

**మెనూలో కోత...**

- అర్థాకలితో వసతిగృహ విద్యార్థులు
- అధికారుల ప్రతిపాదనలు బుట్టదాఖలు
- బడ్జెట్‌లో నిధులు పెంచని ప్రభుత్వం
- అష్టకష్టాలతో నెట్టుకొస్తున్న నిర్వాహకులు

విశాలాంధ్ర - పాడేరు: నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నా, బడ్జెట్‌లో ప్రభుత్వం వసతి గృహాల విద్యార్థుల మెనూ ఛార్జీలు పెంచడం లేదు. మార్కెట్ ధరలకు అనుగుణంగా కాకుండా ఐదేళ్ల కిందట ఉన్న రేట్లతోనే నిధులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థులను అర్థాకలితోనే నిద్రపుచ్చుతోంది. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా వసతి గృహాల నిర్వహణకు మెస్ చార్జీలు పెంచాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారులు ప్రతిపాదనలు చేస్తున్నా బడ్జెట్ కేటాయింపు బుట్టదాఖలైన పరిస్థితులే దర్శనమిస్తున్నాయి. పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక నిర్వాహకులు మెనూలో కోతలు పెడుతున్నారు.

అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలోని 122 ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాలు, 49 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలలో సుమారు 50వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పూర్తిస్థాయి మెనూ అమలుచేయకపోవడంతో ఆయా వసతి గృహాల విద్యార్థులు అర్థాకలితో అలమటిస్తున్నారు. మెనూ ప్రకారం నిధులు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలం చెందడంతో నిర్వాహకులు మెనూ అమలు చేయలేక చేతులెత్తేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటల్లో నిజం నేతిబీరకాయ చందంగా ఉంది.

నిత్యావసర సరుకుల ధరలు మార్కెట్లో విపరీతంగా పెరిగిపోయాయి. దీనికితోడు చమురు ధరలు పెరిగాయి. గతంలో గ్యాస్ సిలిండర్ రూ. 781... ప్రస్తుతం రూ .1094లుగా ఉంది. గతంలో కిలో కందిపప్పు రూ. 52 ఉండగా, నేడు రూ.110 ఉంది. ఈ స్థాయికి తగ్గట్టు వసతి గృహాల బడ్జెట్లో నిధులు కేటాయింపులు జరగడం లేదు. దీంతో వసతి గృహాల నిర్వహణ కష్టతరంగా మారడంతో మెనులో కోతలు విధిస్తున్నారు.

వసతి గృహాల్లో 3 నుంచి 6వ తరగతి వరకు రూ.1050, 7 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థికి ప్రభుత్వం మెస్ చార్జీల కింద నెలకు రూ. 1250, కళాశాలల విద్యార్థులకు నెలకు రూ. 1400 చెల్లిస్తుంది. గతంలో కళాశాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం రెండు పూటల భోజనం, వారంలో రెండు రోజులు కోడి కూర, ప్రతిదినం పాలు, పండు సాయంత్రం స్నాక్స్ అందించేవారు. ప్రస్తుతం మెనూలో కోతలు పెడుతున్నారు. రోజుకు రూ.46.66 తో ఉదయం అల్పాహారం రెండు పూటల భోజనం, వారంలో ఒకరోజు కోడికూర, మూడు రోజుల గుడ్లు, ప్రతి దినం పాలు పండు సాయంత్రం స్నాక్స్ పెట్టాలి. ఆశ్రమ విద్యార్థులకు రోజుకు రూ 41. 66 చెల్లిస్తుంది. ధరలు పెరగడంతో మెనూ కోతలు పెడుతూ నిర్వాహకులు నెట్టుకొస్తున్నారు. ప్రస్తుత ధరల కనుగుణంగా మెస్ చార్జీలు పెంచి, బడ్జెట్లో నిధులు పెంచి, మెనూ పక్కాగా అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు.

**చైనాపై కవ్వింపు చర్యలు అమెరికాకు తగదు: టర్కీ** 2లో

# భేటీల పర్వం

- నేడు కుప్పం కార్యకర్తలతో జగన్
- పార్టీ బలోపేతం, అభివృద్ధిపై దిశానిర్దేశం
- నియోజకవర్గానికి 40 మంది
- 2024 ఎన్నికల గెలుపే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ కార్యకర్తలతో భేటీలకు ఆ పార్టీ అధినేత, సీఎం జగన్ సిద్ధమయ్యారు. ఈనెల 4వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గ కార్యకర్తలను సీఎం స్వయంగా కలసి, వారి సమస్యల్ని ఆలకించనున్నారు. తొలిరోజు కుప్పం నియోజకవర్గం కేంద్రంగా జగన్ భేటీ ప్రారంభం కానుంది. సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచే అధికార వైసీపీ హడావుడి చేస్తోంది. మూడేళ్లపాటు పార్టీపై ఎలాంటి దృష్టి పెట్టకపోవడంతో, సొంత పార్టీ శ్రేణుల నుంచి నిరసనలు, అసంతృప్తులు వెల్లువెత్తాయి. కనీసం జగన్‌ను కలిసేందుకు ఎమ్మెల్యేలకు సైతం అనుమతులు లేకపోవడంతో వారికి దిక్కుతోచని స్థితి నెలకొంది. నియోజకవర్గ సమస్యలు పరిష్కారం కాక, అభివృద్ధి పనులకు నిధులు రాక ఎమ్మెల్యేలు అసంతృప్తిలో ఉన్నారు. ఇవి మరీ పెరిగిపోవడంతో జగన్ దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. నియోజకవర్గ, జిల్లా స్థాయిలో వైసీపీ ప్లీనరీలు నిర్వహించి, అనంతరం విజయవాడ-గుంటూరు కేంద్రంగా రాష్ట్ర స్థాయి ప్లీనరీ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులతో ప్రతినెలా జగన్ సదస్సులు నిర్వహిస్తూ, వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. గెలిచే వారికే టికెట్ ఉంటుందనే సంకేతం తీసుకెళ్లారు. వార్డు/గ్రామ సచివాలయాలను ప్రతి ఎమ్మెల్యే

- మిగతా 2 లో

# 'నేషనల్ హెరాల్డ్'కు సీల్

## ఆగని సోదాలు: ఈడీ దూకుడు

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణ కీలక మలుపు తీసుకుంది. మనీ లాండరింగ్ కేసులో నేషనల్ హెరాల్డ్ కార్యాలయానికి తాజాగా ఈడీ అధికారులు సీల్ వేశారు. తమ అనుమతి లేకుండా కార్యాలయం తెరవకూడదని అధికారులు స్పష్టం చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసు విచారణలో ఈడీ మరింత దూకుడు పెంచింది. దిల్లీలోని నేషనల్ హెరాల్డ్ న్యూస్ పేపర్ కార్యాలయంతో పాటు మొత్తం 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. కేసు విచారణలో భాగంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని ప్రశ్నించిన అనంతరం ఈడీ ఈ మేరకు చర్యలకు ఉపక్రమించింది. జులైలో సోనియాని ఈడీ దాదాపు 12 గంటలు ప్రశ్నించింది. 100కిపైగా ప్రశ్నలు సంధించింది. అంతకుముందు రాహుల్ గాంధీని కూడా ఐదు రోజులకుపైగా 150కిపైగా ప్రశ్నలు అడిగిన విషయం తెలిసిందే. మరోవైపు, బుధవారం కూడా నేషనల్ హెరాల్డ్ కార్యాలయాలలో ఈడీ సోదాలు జరిపింది.

నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్) కంపెనీని కొనుగోలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నిధులు

- మిగతా 2 లో

# ఎన్ఈపీ వద్దే వద్దు

- పాత పింఛన్ విధానం అమలు
- ఏఐఎఫ్‌యూటీఓ ధర్నాలో వక్తల డిమాండు

న్యూఢిల్లీ: మోదీ సర్కారు తీసుకొచ్చిన నూతన విద్యావిధానం(ఎన్ఈపీ) ద్వారా విద్యారంగం ఖూనీ అవుతుందని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిలభారత విశ్వవిద్యాలయాలు, కళాశాల ఉపాధ్యాయుల సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌యూటీఓ) డిమాండు చేసింది. ఎన్ఈపీ అంటే ఉన్నత విద్య వ్యాపారీకరణ, వర్గీకరణ అని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. దీంతో విద్యావ్యవస్థ సర్వనాశనమవుతుందని అన్నారు. ఏఐఎఫ్‌యూటీఓ అధ్వర్యంలో వివిధ రాష్ట్ర, కేంద్ర విశ్వవిద్యాలయాల నుంచి టీచర్లు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. విద్యారంగంలో ఎన్ఈపీ, సీయూఈటీ, ఎఫ్‌వైయూపీ, హెచ్ఈఎఫ్ఏ తదితర వ్యవస్థాగత మార్పులను తిరస్కరించారు. ఎన్ఈపీ అంటే ఉన్నత విద్య వ్యాపారీకరణ, వర్గీకరణ అంటూ నినదించారు. వక్తల్లో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, ఏఐఎఫ్‌యూసీటీఓ అధ్యక్షుడు కేశవ్ భట్టాచార్య, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ అరుణ్ కుమార్, డీయూటీఏ మాజీ అధ్యక్షుడు నందితా నరేన్, ఎఫ్ఈడీసీయూటీఏ మాజీ అధ్యక్షులు దినేశ్ వర్షిణి తదితరులు ఉన్నారు. నూతన విద్యావిధానం (ఎన్ఈపీ)

- మిగతా 2 లో

# చైనాపై కవ్వింపు చర్యలు అమెరికాకు తగదు: టర్కీ

**బీజింగ్:** తైవాన్‌లో అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ పర్యటన చైనా సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను తీవ్రంగా దెబ్బతీస్తుందని, తైవాన్‌లో శాంతి, స్థిరత్వానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని అంతర్జాతీయ విద్యావేత్తలు,విశ్లేషకులు, అధికారులు పేర్కొన్నారు. పెలోసీ పర్యటన అంతర్జాతీయ చట్టాలను, అంతర్జాతీయ సంబంధాలను నియంత్రించే ప్రాథమిక నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించిందని పేర్కొన్నారు. అమెరికా చేపట్టిన ఈ చర్య అంతర్జాతీయ సమాజానికి సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. చైనా సార్వభౌమాధి కారం, ప్రాదేశిక సమగ్రత ఉల్లంఘనను ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించదని పేర్కొన్నారు. ఈ పర్యటనపై క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ, రష్యా చైనాకు సంఘీభావంగా ఉందని టాస్ నివేదించింది. "మేము చైనా సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తాము ప్రపంచంలోని ఏ దేశానికీ దానిని ప్రశ్నించే హక్కు ఉండదని" అన్నారు. ఇతర దేశాల సార్వభౌమాధికారం పై అమెరికాకు గౌరవం లేదు. దాని స్వంత భౌగోళిక రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తుందని సిరియా విశ్లేషకుడు ఘసన్ యూసఫ్ అన్నారు. పాకిస్తాన్ అంతర్జాతీయ లాఫేర్ స్పెషలిస్ట్ హసన్ అస్లామ్ షాద్ మాట్లాడుతూ, చైనాకు వ్యతిరేకంగా తైవాన్‌ను వంతెనగా మార్చడానికి అమెరికా యత్నిస్తోందని అన్నారు. పెలోసి తైవాన్ పర్యటన ద్వారా ఏర్పడిన సమస్యలకు అమెరికా బాధ్యత వహిస్తుందని అన్నారు. అమెరికాకు వ్యతిరేకంగా టర్కీ మాజీ దౌత్యవేత్త ముస్తఫా నోయన్ రోనా మాట్లాడుతూ, చైనాపై కవ్వింపు చర్యలను అమెరికా నిలిపివేయాలని, పెలోసి సందర్శన తైవాన్‌కు ఎటువంటి ప్రయోజనాలను తీసుకురాదని స్పష్టం చేశారు.

**ఒకే చైనా సూత్రాన్ని సవాలు చేయడం వ్యర్థం**

ఒకే చైనా విధానానికి కట్టుబడి ఉండబోమని అమెరికా పదే పదే ప్రకటించింది, అయితే కొందరు రాజకీయ నాయకులు ఏక చైనా సూత్రాన్ని సవాలు చేసి ఈ రాజకీయ కుతంత్రాలు చేస్తున్నారని ది ఫిలిప్పైన్ స్టార్ అనే ఆంగ్ల దినపత్రికకు కాలమిస్ట్ విల్సన్ లీ ఫ్లోర్స్ అన్నారు. వన్-చైనా సూత్రం అంతర్జాతీయ సమాజం ద్వారా విశ్వవ్యాప్తంగా గుర్తించబడిన ఆనవాయితీ అని, తైవాన్ చైనాలో ఒక భాగమని, ఇది కాదనలేని వాస్తవమని, వన్-చైనా సూత్రాన్ని అమెరికా పాటించాలని ఆయన అన్నారు. తైవాన్‌లో అమెరికా అధికారుల సందర్శనలు ఒక-చైనా సూత్రాన్ని తీవ్రంగా ఉల్లంఘిస్తాయని, తైవాన్ జలసంధి అంతటా శాంతి, స్థిరత్వానికి హాని కలిగిస్తాయని ఇండోనేషియా థింక్ ట్యాంక్ ఆసియా ఇన్నోవేషన్ స్టడీ సెంటర్ ఛైర్మన్ బాంబాంగ్ సూర్యోనో అన్నారు, అమెరికా ఒకే చైనాకు కట్టుబడి ఉండటం గురించి మాట్లాడుతుందని అన్నారు. చైనా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా ద్వంద్వ-వ్యవహారాలు, జోక్యాన్ని తీవ్రంగా ఖండించాలని పేర్కొన్నారు. పెలోసి తైవాన్ పర్యటన చట్టవిరుద్ధమైన, వ్యర్థమైనదిగా పేర్కొన్నారు. యుఎస్ పబ్లికేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంటెలిజెన్స్ రివ్యూ వాషింగ్టన్ బ్యూరో చీఫ్ విలియం జోన్స్, పెలోసి తైవాన్ పర్యటనను ఆమె "అవివేకపు చర్య"గా అభివర్ణించారు. ఆమె పర్యటన ఏక చైనా సిద్ధాంతానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టడమేనని స్పెయిన్ కమ్యూనిస్ట్ పార్టీ అధ్యక్షుడు జోస్ లూయిస్ సెంటెల్లా అన్నారు. పెలోసి పర్యటన "అమెరికా-చైనాల మధ్య సంబంధాలను ప్రభావితం చేయడమే కాకుండా, మొత్తం గ్రహాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేసే ఉద్రిక్తతలను సృష్టిస్తుంది" అని స్పెయిన్ కమ్యూనిస్ట్ పార్టీ పేర్కొంది.

**తైవాన్ పండ్లు, చేపల దిగుమతిపై చైనా ఆంక్షలు**

పెలోసీ తైవాన్‌లో పర్యటించిన నేపథ్యంలో తైవాన్ నుంచి దిగుమతి చేసుకునే పండ్లు, చేపలపై చైనా ఆంక్షలను ప్రకటించింది. తైవాన్‌కి పంపనున్న ఇసుక రవాణాను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. పెలోసీ తైవాన్ పర్యటన చైనాతో దౌత్యపరమైన సమస్యలు తలెత్తాయి. సిట్రస్ జాతికి చెందిన కొన్ని రకాల పండ్లు, చేపల దిగుమతిని నిషేధించినట్లు చైనా కస్టమ్స్ శాఖ తెలిపింది. పండ్లు, చేపల్లో క్రిమిసంహారకాలు ఎక్కువ శాతం ఉన్నాయని, కొన్ని ప్యాకెట్లలో కరోనా టెస్టు పాజిటివ్ వస్తుందని కస్టమ్స్ శాఖ తెలిపింది. సహజమైన ఇసుకను తైవాన్‌కు ఎగుమతి చేసే అంశంపై నిషేధం విధిస్తున్నట్లు చైనా వాణిజ్య శాఖ నోటీసు ఇచ్చింది.

## చైనాకు కోస్టారికా కమ్యూనిస్టుల మద్దతు

**శాన్ జోస్:** తైవాన్‌లో నాన్సీ పెలోసి పర్యటనను ఖండిస్తూ కోస్టారికాలోని పీపుల్స్ వాన్‌గార్డ్ పార్టీ (పివిపి) తీవ్రంగా ఖండించింది. చైనా ఒక్కటే, ప్రత్యేకమైనది, అవిభాజ్యమైనదిగా పేర్కొన్నారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీ జనరల్ సెక్రటరీ, అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ఉద్దేశించి కోస్టారికా సీపీ ప్రధాన కార్యదర్శి హంబర్టో వర్గాస్ రాసిన లేఖలో చైనా ప్రజలకు తన గౌరవాన్ని, అభినందనలు తెలిపారు. నాటో,అమెరికా దేశాల సామ్రాజ్యవాద చట్రంలో ప్రపంచంలోని ప్రజల ప్రామాణికత, ప్రాదేశిక సార్వభౌమాధికార సమగ్రతకు వ్యతిరేకంగా చేపట్టిన చర్యలను తీవ్రంగాఖండించింది. "చైనా ఒకటి, ప్రత్యేకమైనది.. విడదీయరానిదని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ తమ సరిహద్దులు, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలలో విశ్వవ్యాప్త గౌరవాన్ని చట్టబద్ధంగా కోరుకుంటారని పేర్కొంది. సామ్రాజ్యవాద ఆధిపత్యంలోని ఏకధృవ ప్రపంచ విధానాలను అధిగమించాలని సూచించింది.శాంతి, సార్వత్రిక సౌభ్రాతృత్వ ప్రపంచానికి దారితీసే కొత్త మార్గాలకు కోస్టారికన్ కమ్యూనిస్టులు అభిప్రాయపడుతున్నారని పేర్కొంది. చైనా లక్ష్యాలతో మీరు విజయం సాధించాలని మేము కోరుకుంటున్నాము. చైనా ప్రజలందరూ అదే విధంగా ఉండాలని కోరుకుంటున్నామని ఆ లేఖలో పేర్కొన్నారు.

## 'ఉచితాల'పై నిష్పాక్షిక కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఉచిత హామీలపై చర్చకు ఈసీఐని దూరంగా ఉంచాలని, అది ఎంఎఫ్ఐ (అత్యంత అనుకూలమైన సంస్థ) అని అన్నారు. ఈ వ్యవహారం కేవలం ఎన్నికలకు సంబంధించినదే కాదు రాజకీయ-ఆర్థికపరమైనది కూడా అని వ్యాఖ్యానించారు. ఉచిత హామీల అంశంపై పార్లమెంటులో చర్చ జరగాల్సిందేనని నొక్కిచెప్పారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి రమణ స్పందిస్తూ 'పార్లమెంటులో చర్చ జరుగుతుందని మీరు అనుకుంటున్నారా? ఈరోజుల్లో అందరూ ఉచితాలకే మొగ్గు చూపుతున్నారు. ఏ రాజకీయ పార్టీ కూడా దీనిని వ్యతిరేకించదు. మేము సామాన్యులు, అణగారిన వర్గాల పక్షాన ఉన్నాం. వారి సంక్షేమంపై శ్రద్ధ అవసరం. దీనిని ఎన్నికల సమయంలో వచ్చే ఒక సమస్య అన్నట్లు మేం భావించడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ బాగునూ పరిగణనలోకి తీసుకుంటున్నాం' అని అన్నారు. ఉచిత హామీల అంశాన్ని పరిశీలించేందుకు నీతి ఆయోగ్, ఆర్థిక కమిషన్, లా కమిషన్, ఆర్బీఐ, విపక్షాలతో పాటు ఇతరులతో కలిసి ప్రభుత్వం పనిచేయాలని, ఆచరణాత్మక పరిష్కారానికి కృషిచేయాలని; ఇలాంటి కమిటీ ఏర్పాటు కోసం రాజకీయ పార్టీలు సూచనలు-సిఫార్సులు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. వారం లోగా ఈ ప్రక్రియ పూర్తి అయితే ఆపై తదుపరి ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది. పిటిషనర్ అశ్విని ఉపాధ్యాయ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపిస్తూ ' అప్పుల్లో ఉన్న పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత హామీల అమలుకు డబ్బు ఎక్కడి నుంచి తెస్తారో బహిర్గతం చేయాలి' అని అన్నారు. సీజేఐ రమణ స్పందిస్తూ 'సామాన్యులు పన్నులు చెల్లిస్తున్నది పురోగతి/అభివృద్ధి కోసం తమ డబ్బు వినియోగమవుతుందన్న నమ్మకంతోనే అని చెప్పారు. ప్రయోజనాలు కేవలం సంపన్నులకే కాదు పేదలకూ అందాలని సూచించారు. ఉచిత హామీల నియంత్రణకు నమూనా మేనిఫెస్టోను ఈసీఐ రూపొందించాలని సింగ్ సూచన చేయగా ఇదంతా ఈసీఐ చూసుకుంటే కోర్టు జోక్యం అవసరమయ్యేది కాదని సీజేఐ రమణ వ్యాఖ్యానించారు. ఎన్నిలకల హింసకు వ్యతిరేక ఆదేశాలు బేఖాతరవు అవుతున్నట్లు తెలిపారు. నమూనా మేనిఫెస్టో వంటి డొల్ల లాంఛనలతో ఉపయోగం ఉండదని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు, ముఖ్యమంత్రులు, భాగస్వాములు కలిసి ఉచిత హామీల సమస్యకు ఆచరణాత్మక పరిష్కారాన్ని కనుగొనాలని, ఇందుకోసం ప్రతిపాదిత కమిటీ ఉపయుక్తంగా పరిణమించవచ్చునని సుప్రీంకోర్టు పేర్కొంది. తదుపరి విచారణను వచ్చే గురువారానికి వాయిదా వేసింది.

## 'నేషనల్ హెరాల్డ్'కు సీల్

(మొదటిపేజీ తరువాయి)

దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై 2012 నవంబరు 1న ఢిల్లీలోని ఓ కోర్టులో బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి ప్రైవేటు కేసు దాఖలు చేశారు. వారిద్దరూ మోసానికి పాల్పడ్డారని, ఏజేఎల్‌కు చెందిన వేల కోట్ల రూపాయల విలువ చేసే భూములను కాజేశారని ఆయన ఆరోపించారు. ఢిల్లీ, యూపీ తదితర ప్రాంతాల్లో ఏజేఎల్‌కు ఉన్న రూ.1,600 కోట్ల విలువైన ఆస్తులను వారిద్దరూ యజమానులుగా ఉన్న యంగ్ ఇండియన్ కంపెనీ ద్వారా మోసపూరితంగా దక్కించుకున్నారని పేర్కొన్నారు. ఈ కేసులోనే మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ జరిపిన ఈడీ సోనియా, రాహుల్‌కు సమన్లు జారీ చేసింది.

## నిర్వాసితులను నిండా ముంచారు

(మొదటిపేజీ తరువాయి)

చేతులు దులుపుకుందని, ప్రభుత్వ వైఖరి సరికాదన్నారు. విలీన మండలాల నిర్వాసితులు విసిగిపోయి మమ్మల్ని తెలంగాణాలో కలపండి అని ధర్నాలు చేస్తున్నారని, ఇది రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటయిన విషయం అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అన్నీ కోల్పోయిన నిర్వాసితులు ఇప్పుడు చాలా బాధ పడుతున్నారని, ప్రాజెక్టు సత్వరమే పూర్తి కావడానికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏక తాటి పైకి వచ్చి కేంద్రం పై వత్తిడి తేవాలని కోరారు. పోలవరం పై రాష్ట్రంలోని ఎంపీలందరూ మొద్దు నిద్ర వీడి పార్లమెంట్‌లో గళం ఎత్తాలని అన్నారు. రాష్ట్రం ఖర్చు పెట్టిన రూ.2,700 కోట్లు ఇప్పటివరకూ కేంద్రం ఇవ్వలేదని, తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.30 వేల కోట్లు కేటాయిస్తేనే ప్రాజెక్టు పనులు ముందుకు సాగుతాయన్నారు. పోలవరం సత్వర నిర్మాణం కోసం అన్ని రాజకీయ పార్టీలు, నిర్వాసితులు, గిరిజన సంఘాలను కలుపుకుని కేంద్ర ప్రభుత్వం పై వత్తిడి తేవడానికి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి నిర్వాసితులకు న్యాయం చేసే వరకు సీపీఐ పోరాడుతుందని తెలిపారు. పోలవరం సమస్య పరిష్కారం కోసం అన్ని పక్షాలది ఒకే గొంతుక కావాలని, రాజకీయాలకు అతీ తంగా రాష్ట్ర అభివృద్ధికి కలిసి రావాలన్నారు. ప్రాజెక్టు సాకారం కోసం కలసి రానటువంటి వారి దుర్మార్గాన్ని తెలుగు జాతి సహించదన్నారు. భేషజాలు పక్కన పెట్టి, విమర్శలు తగ్గించుకుని, కలసికట్టుగా కేంద్ర ప్రభుత్వం పై వత్తిడి తెచ్చి పోలవరం నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో ఆల్ ఇండియా కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ముప్పాళ్ల సుబ్బారావు, సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, పోలవరం మండల కార్యదర్శి జల్లేపల్లి వెంకటనరసింహారావు, పార్టీ నాయకులు కొండు రాంబాబు, వి.కొండలరావు, తిరుమలశెట్టి రవికుమార్, ప్రసాద్, కార్యకర్తలు, ఈ.ఈ.పి. ఆదిరెడ్డి, మేఘా కంపెనీ డీజీఎం రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 9.79 లక్షలకు పైగా ఖాళీలు: కేంద్రం

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందన్న ఆరోపణలకు బలం చేకూరింది. 2021 మార్చి ఒకటి నాటికి వివిధ విభాగాల్లో 9.79 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. బుధవారం లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో 9,79,327 ఖాళీలు ఉన్నాయని లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఇందులో గ్రూప్ ఏ స్థాయి పోస్టులు 23,584, గ్రూప్ బీ స్థాయి పోస్టులు 1,18,801, గ్రూప్ సీ స్థాయి పోస్టులు కూడా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సృష్టించడం, భర్తీ చేయడం అనేది సిబ్బంది వ్యవహారాలశాఖ బాధ్యత అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని విభాగాలకు సంబంధించిన ఖాళీలను సమయానుకూలంగా భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని వివిధ మంత్రిత్వ శాఖలు కోరినట్టు తెలిపారు.

### పది సప్లిమెంటరీలో

# 64.23 శాతం ఉత్తీర్ణత

- ప్రకాశం అధికం, పశ్చిమ స్వల్పం
- ఫలితాలు ప్రకటించిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో 64.23 శాతం విద్యార్థులు ఉత్తీర్ణుల య్యారు. విజయవాడలో లెమన్ ట్రీ హోటల్‌లో బుధవారం ఈ ఫలితాలను మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేశారు. ఇందులో బాలికలు 68.76 శాతం, బాలురు 60.83 శాతం ఉత్తీర్ణత నమోదయింది. మొత్తంగా 64.23 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ప్రకటించారు. పది సప్లిమెంటరీకి 2,06,648 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,91,846 మంది పరీక్షలు రాశారు. బాలురులో 1,09,413 మంది హాజరుకాగా 66,554 మంది (60.83 శాతం), బాలికలు 82,433 మంది హాజరుకాగా 56,677 మంది (68.76 శాతం) నమోదయింది. మొత్తంగా బాలికలు, బాలురు కలుపుకుని 1,23,231 మంది 64.23 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ప్రకాశం జిల్లాలో 87.52 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, పశ్చిమ గోదావరి జిల్లాలో అత్యల్పంగా 46.66 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. రెగ్యులర్, అడ్వాన్స్ సప్లిమెంటరీతో కలుపుకుని మొత్తంగా పదవ తరగతి పరీక్షలకు 6,06,070 మంది పరీక్షలకు హాజరు కాగా, 5,37,491 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా ఉత్తీర్ణతా శాతం 88.68 శాతంగా నమోదయింది.

**విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యం: మంత్రి బొత్స**

విద్యార్థుల భవిష్యత్, వారి ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. కరోనా కారణంగా రెండేళ్లుగా పాఠశాలలు లేక చదువులు కుంటుపడిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో కొంతవరకు ఇబ్బందులకు గురైనందున వారికి మేలు చేకూరేలా సప్లిమెంటరీ పరీక్షలకు వర్తించే 'కంపార్టుమెంటల్ పాస్'ను ఈ విద్యాసంవత్సరం వరకు మినహాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో తప్పిన ప్రతి విద్యార్థికి హాల్ టికెట్లు ఇచ్చామని, పరీక్ష రుసుం పెట్టలేదని గుర్తు చేశారు. ఈ ఒక్క సంవత్సరమే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో ఉత్తీర్ణత సాధించిన వారిని నేరుగా ఉత్తీర్ణులుగా పరిగణిస్తామన్నారు. సీఎం జగన్ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వివరించారు. ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక ప్రమాణాలు మెరుగుపర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనికి ఉద్యోగులు, ప్రజలు అందరూ సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. విద్యాసంస్కరణలపై ఇటీవల ప్రభుత్వంపై జరుగుతున్న అసత్య ప్రచారాలను, ఆరోపణలను మంత్రి బొత్స సత్యనారాయణ ఖండించారు. 'అమ్మఒడి' పథకం ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలకు ఇస్తున్నామన్నారు. విద్యా సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం బైజూస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందని, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తున్నామన్నారు. త్వరలో ప్రతి తరగతి గదిలో అంకాత్మక తెరలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, కమిషనర్ సురేష్ కుమార్, ప్రభుత్వ పరీక్షల సంచాలకులు దేవానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తరగతుల విలీనమే...

(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బందులుంటాయన్నారు. అనవసర ప్రచారం చేసి ప్రజల్లో ఆందోళన కలిగించవద్దన్నారు. ఇప్పటికే ఇబ్బందులున్నాయి, తరగతులు లేవన్న ప్రచారాలపై త్వరలోనే ఆ పాఠశాలలకు వెళతామని తెలిపారు. పిల్లలు గొప్ప వాళ్లు కావాలని కోరుకునే తల్లిదండ్రులంతా, ఇంటి పక్కనే పాఠశాల ఉండాలని ఆశించకూడదన్నారు. ప్రభుత్వానికీ, ప్రజల మధ్య ఎన్నుకున్న ఎమ్మెల్యేలు ఉన్నందున, విలీన ప్రక్రియపై వారి అభిప్రాయాలను తీసుకుంటున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చేపడుతుందన్నారు. విలీన ప్రక్రియపై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ల కమిటీ నివేదిక రాగానే, దానిపై నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. రాబోయే తరాల భవిష్యత్తు కోసమే విలీనం చేస్తున్నామని పునరుద్ఘాటించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి అందరూ సహకరించాలని కోరారు.

## విభజన హామీలను త్వరగా నెరవేర్చండి

### పార్లమెంట్‌లో వైసీపీ, టీడీపీ ఎంపీల డిమాండ్

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** విభజన చట్టం అంశాలు, హామీల అమలుపై సత్వర చర్యలు తీసుకోవాలని వైసీపీ, టీడీపీ ఎంపీలు బుధవారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లుపై లోక్‌సభలో చర్చ సందర్భంగా వైసీపీ, టీడీపీ ఎంపీలు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన వల్ల అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలను కోల్పోయామని పార్లమెంట్లో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. తత్ఫలితంగా రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం పడిందని కోల్పోయిన వాటిలో కేంద్ర విద్యా సంస్థలు కూడా ఉన్నాయని పరిహార చర్యగా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 ప్రకారం ఉన్నత విద్య కోసం రాష్ట్రంలో కేంద్ర విద్యా సంస్థల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వబడిందని చెప్పారు. అయితే తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) అనే రెండు ప్రముఖ సంస్థలు ఇప్పటికీ తాత్కాలిక క్యాంపస్‌ల నుంచే పనిచేస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర విభజన జరిగిన ఎనిమిదేళ్ల తర్వాత కూడా శాశ్వత క్యాంపస్, మౌలిక సదుపాయాల కొరత ఈ ఇన్‌స్టిట్యూట్‌ల అభివృద్ధికి ఆటంకంగా ఉందన్నారు. ఐఐఎస్ఈఆర్, ఐఐటీ అభివృద్ధి తిరుపతి ప్రాంతానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ఈ సంస్థలను ఉన్నత విద్య, పరిశోధనలలో అత్యుత్తమ కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం యొక్క నిరంతర మద్దతు, సహకారం అవసరం అని చెప్పారు. తిరుపతిలో ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ యొక్క వేగవంతమైన అభివృద్ధికి అవసరమైన అన్ని ఆర్థిక, ఆర్థికేతర సహాయా, సహకారాలను అందించాలని గౌరవ సభ ద్వారా కేంద్ర విద్యా శాఖా మంత్రికి గురుమూర్తి విన్నవించారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీలో ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ, ఐఐఎం, సెంట్రల్ యూనివర్శిటీ, పెట్రోలియం యూనివర్శిటీకి స్థలాలు కేటాయించినా నేటికీ నిర్మాణాలు పూర్తి కాలేదని టీడీపీ ఎంపీ కె.రామ్మోహన్ నాయుడు అన్నారు. గిరిజన వర్శిటీకి కేంద్రం తన వాటాను ఖర్చు చేసి వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## భేటీల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

సందర్శించాలంటూ లక్ష్యం విధించారు. పనితీరు బాగా లేకుంటే, ఇక టికెట్‌లు ఉండవని తేల్చిచెప్పారు. దీంతో ఎమ్మెల్యేల్లో ఒకింత అభద్రతా భావం నెలకొంది. ఇప్పటివరకు రెండు విడతలుగా జరిగిన సదస్సుల్లో రాబోయే 2024 ఎన్నికల్లో 175/175 సీట్లు సాధించాలంటూ జగన్ లక్ష్యం విధించారు. ఎవరైనా అభివృద్ధి పనులపైన లక్ష్యం విధిస్తారేగానీ, ఇలా ఎన్నికల్లో విజయంపై జగన్ ఆదేశించడం విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వం 85శాతం మందికి సంక్షేమ పథకాలు అందజేస్తోందని, వారి దగ్గరకు వెళ్లి ఆయా విషయాలు తెలుసుకోవాలంటూ ఎమ్మెల్యేలను ఆదేశించారు. జగన్ విధిస్తున్న లక్ష్యాలపైనా కొంత మంది ఎమ్మెల్యేల్లో అసంతృప్తి నెలకొంది. వాటిని బుజ్జగించేందుకుగాను, నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యేకు రూ.2కోట్ల నిధులు కేటాయించారు. అటు సచివాయాల పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20లక్షల నిధులు వెచ్చించారు. అంతటితో ఆగకుండా పార్టీ క్రియాశీలక నేతలు, కార్యకర్తల్లో నెలకొన్న అసంతృప్తులను తొలగించేందుకుగాను వారితో జగన్ భేటీలు ప్రారంభించారు.

**వైసీపీలో ఆగని అసంతృప్తి**

మంత్రివర్గ విస్తరణ అనంతరం ఇంకా సీనియర్లలో అసంతృప్తి కొనసాగుతోంది. ఏలూరుజిల్లాకు చెందిన ఆళ్ల నానిని మంత్రివర్గం నుంచి తొలగించాక, ఆయన ప్రభుత్వ, పార్టీ కార్యకలాపాల్లో అంత ఉత్సాహంగా కన్పించడం లేదు. మంత్రివర్గం నుంచి తొలగించడంపై అలక చెందినట్లుగా ప్రచారముంది. ఇదేబాటలో మరికొంతరు సీనియర్లు ఉన్నారు. మంత్రి పదవులు పోయిన వారికి పార్టీలో జిల్లా అధ్యక్ష పదవులు, ప్రాంతీయ సమన్వయకర్తల బాధ్యతల్ని అప్పగించినప్పటికీ, వారు పూర్తి స్థాయిలో ముందుకెళ్లడం లేదు. వైసీపీలో కింది నుంచి పై స్థాయి వరకు ఉన్న అసంతృప్తిని తొలగించడం, రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం వెరసి జగన్ భేటీలు సిద్ధమయ్యారు.

**కుప్పం నుంచి ఆరంభం**

ప్రతిపక్ష నేత చంద్రబాబు నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పం నుంచి జగన్ భేటీలు ప్రారంభంకానున్నాయి. ఈనెల 4వ తేదీ, కుప్పం నియోజకవర్గం కార్యకర్తలతో జగన్ భేటీ అవుతారు. పార్టీ కోసం, ప్రగతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న దాదాపు 40 మంది వైసీపీ ముఖ్య కార్యకర్తలను నేరుగా ఆయన కలిసి వారి సమస్యలపై ఆరా తీస్తారు. స్థానిక, నియోజకవర్గ పరిస్థితుల్ని అడిగి తెలుసుకుంటారు. రోజూ మధ్యాహ్నం సమయంలో ఈ భేటీ జరగనుంది. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులు, పురోగతి, బలోపేతం, అభివృద్ధిని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, ప్రత్యర్థుల నోళ్లను ఎలా మూయించాలి, తదితర విషయాలపై సీఎం జగన్ నేరుగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని సమాచారం.

## ఎన్‌ఈపీ వద్దే వద్దు

(మొదటిపేజీ తరువాయి)

2020కు వ్యతిరేకంగా వేలాది పిటిషన్లు, సూచనలు చేసినా కేంద్రప్రభుత్వం నుంచి స్పందనే కరువైన క్రమంలో దేశవ్యాప్తంగా వందలాది మంది టీచర్లు ఎన్ఈపీకి వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. 25 డిమాండ్లతో పత్రాన్ని విడుదల చేశారు. కోవిడ్ మహమ్మారి విజృంభించినప్పుడు టీచర్లపై కేంద్రప్రభుత్వం ఆన్‌లైన్ విద్యాభ్యాసం ద్వారా తీవ్ర ఒత్తిడి తీసుకు వచ్చిందని వక్తలు దుయ్యబట్టారు. విద్యారంగం అంతానికి ఎన్ఈపీ గురితప్పని విధానమని వ్యాఖ్యానించారు. దీనిని తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఒక్క ఢిల్లీ యూనివర్సిటీలోనే వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తాత్కాలిక పద్ధతిలో 4వేల పోస్టుల భర్తీ జరిగిందన్నారు. టీచర్ల భర్తీని చేపట్టాలని డిమాండు చేశారు. పాత పింఛన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని, కాలేజీ, వర్సిటీ టీచర్లకు ఏకరూప పింఛన్ పథకాన్ని అమలు చేయాలని, 7వ యూజీసీ వేతనాలు, పింఛన్ అమలు చేయాలని, కాలేజీల్లో సీఏఎస్ పదోన్నతుల కోసం ఆర్‌సీఐ ఓసీని డిసెంబరు 31 వరకు పొడిగించాలని, ప్రభుత్వ స్కూళ్ల విలీనాన్ని ఆపేయాలని, ఈసీసీఈ నుంచి పీజీ స్థాయి వరకు విద్యాహక్కు అమలు చేయాలని, శాశ్వత టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని, నీట్, సీయూఈటీ, ఇతర కేంద్ర పరీక్షలను రద్దు చేయాలని, విద్య వర్గీకరణను విడనాడి కేజీ నుంచి పీజీ వరకు లౌకిక విలువలను పెంపొందించాలని, ఈసీసీఈ వర్కర్లు, మహిళా వర్కర్ల హక్కులకు హామీనివ్వాలని, అగ్నిపథ్ పథకాన్ని ఉపసంహరించుకోవాలని, కీలక జాతీయ రంగాల ప్రైవేటీకరణ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు. ఏఐఎఫ్‌యూసీటీఓ డిమాండ్లకు పంజాబ్ & చండీగఢ్ కాలేజీ టీచర్స్ యూనియన్ (పీసీసీటీయూ), అఖిల కేరళ ప్రైవేట్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్స్ (ఏకేపీసీటీఏ), హరియాణా గవర్నమెంట్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ (హెచ్‌జీసీటీఏ), బీహార్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (బీయూటీఏ), తమిళనాడు రిటైర్డ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్, రాజస్థాన్ యూనివర్సిటీ & కాలేజీ టీచర్స్ అసోసియేషన్ మద్దతిచ్చాయి. ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఏఐపీఎస్‌సీఎన్), ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) సంఘీభావం తెలిపాయి.

## పన్సారే హత్యకేసు ఏటీఎస్‌కు బదిలీ

**న్యూఢిల్లీ:** కమ్యూనిస్టు నేత, సామాజిక కార్యకర్త గోవింద్ పన్సారే హత్య కేసు దర్యాప్తును బుధవారం బాంబే హైకోర్టు, మహారాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక బృందా(ఏటీఎస్)నికి బదిలీ చేసింది. మహారాష్ట్ర క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)కి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటివరకు ఈ కేసును విచారించింది. పన్సారే హత్య జరిగిన ఏడేళ్ల తర్వాత ఈ కేసు దర్యాప్తును బదిలీ చేశారు. పన్సారే కుటుంబ సభ్యులు దాఖలు చేసిన దరఖాస్తును అనుమతిస్తున్నామని, విచారణను ఏటీఎస్‌కు బదిలీ చేస్తున్నామని న్యాయమూర్తులు రేవతి మోహితే దేరే, జస్టిస్ షర్మిలా దేశ్‌ముఖ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. దర్యాప్తును ఏటీఎస్‌కు బదిలీ చేస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది కూడా రాష్ట్ర ప్రభుత్వ సంస్థేనని సిట్ తరపు సీనియర్ న్యాయవాది అశోక్ ముందర్గి కోర్టుకు తెలిపారు. హత్యపై విచారణకు ప్రత్యేక బృందాన్ని నియమించాలని పన్సారే కుటుంబ సభ్యులు దాఖలు చేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు ఆదేశాల మేరకు 2015లో సిట్‌ను ఏర్పాటయింది.

## ప్రమాదకర తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

పరిణామాలపై తీవ్ర భయాందోళనలను వ్యక్తం చేస్తూ ఉమ్మడి ప్రకటనపై సంతకం చేశాయి. తీర్పును సమీక్షించాలని అభ్యర్థించాయి' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. చట్టాన్ని దుర్వినియోగం చేయడం ద్వారా రాజకీయ ప్రతీకారానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, సమీక్ష కోరేందుకు తాము మళ్లీ సుప్రీం కోర్టుకు వెళతామని కొన్ని ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే తెలిపాయి. చట్టం ప్రకారం చాలా తక్కువ శిక్షలు మాత్రమే ఉన్నాయని వారు ఉదహరించారు. అయితే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటయిన ఎనిమిదేళ్లలో గత ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పటి వరకు ఈడీ దాడులు 26 రెట్లు పెరిగాయి. కానీ నేరారోపణ రేటు చాలా తక్కువగా ఉంది. 3,010 మనీలాండరింగ్ సంబంధిత సోదాల్లో కేవలం 23 మంది నిందితులు మాత్రమే దోషులుగా తేలారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ రాజ్యసభలో వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ 112 శోధనలలో మనీలాండరింగ్ నేరారోపణలు లేవు. నేషనల్ హెరాల్డ్ ప్రచురణకు సంబంధించిన కేసులో కాంగ్రెస్ గాంధీలను ఈడీ ప్రశ్నించినప్పుడు ప్రతీకార ఆరోపణలు ఇటీవల పెద్ద ఎత్తున వచ్చాయి. అంతేకాకుండా ఈ సవరణలను పార్లమెంటులో ఏ విధంగా ముందుకు తెచ్చారని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. ఆ ప్రశ్న ఇప్పటికే సుప్రీం కోర్టు ముందు ఉంది. వీటిని ఒక 'మనీ బిల్లు'గా ప్రవేశపెట్టిన ఆర్థిక చట్టం కింద ఆమోదించినట్లు ప్రకటన ఎత్తి చూపింది. మనీ బిల్లు అంటే కొత్త నిబంధనలకు తుది ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపే ముందు, లోక్‌సభ నుంచి ఆమోదం మాత్రమే అవసరం. ప్రభుత్వం కచ్చితంగా ఆమోదం పొందేందుకు సంఖ్యలు లేని ఎగువ సభ అయిన రాజ్యసభ ద్వారా తిరస్కరణకు గురికాదు. 'ఆర్థిక చట్టం ద్వారా సవాలు చేయబడిన సవరణలు చట్టపరంగా చెడ్డవని రేపు సుప్రీం కోర్టు భావిస్తే, అప్పుడు మొత్తం కసరత్తు వ్యర్థమవుతుంది. న్యాయపరమైన సమయాన్ని కోల్పోతుంది' అని ప్రతిపక్ష పార్టీల ప్రకటన పేర్కొంది. ప్రతిపక్షం పెద్ద వాదన ఏమిటంటే, మనీ బిల్లు తప్పనిసరిగా సంచిత నిధి నుంచి డబ్బును కేటాయించడం, పన్ను విధించడం, ఇతర విషయాలపై చట్టాలు చేయడానికి ఉపయోగించబడదు.

అయితే, న్యాయస్థానం గత వారం తీర్పును వెలువరిస్తూ, 'మనీలాండరింగ్ దేశం సామాజిక, ఆర్థిక నిర్మాణాన్ని ప్రభావితం చేయడమే కాకుండా ఉగ్రవాదం, మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరాలు వంటి ఇతర దారుణమైన నేరాలను కూడా ప్రోత్సహిస్తుంది' అని తెలిపింది. కేసు నివేదిక ప్రతి ద్వారా నిందితులకు సమాచారం ఇవ్వకుండా అరెస్టు చేసే అధికారాలు రాజ్యాంగ విరుద్ధమన్న వాదనను తోసిపుచ్చింది. ప్రతి కేసులో ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు సమాచార నివేదిక) ఇవ్వడం తప్పనిసరి కాదని, ఎందుకంటే ఇది అంతర్గత పత్రమని కోర్టు పేర్కొంది. ఇది ఎఫ్ఐఆర్‌ను పోలి ఉందని, నిందితుడికి కాపీని పొందే అర్హత ఉందన్న పిటిషనర్ల సవాలును తోసిపుచ్చింది. అరెస్టు సమయంలో ఈడీ చర్యకు గల కారణాలను నిందితులకు చెబితే సరిపోతుందని కోర్టు పేర్కొంది. నిందితులపై రుజువు భారాన్ని మోపడమంటే, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనంటూ పిటిషనర్లు సవాలు చేశారు. కానీ కోర్టు అంగీకరించలేదు. మనీలాండరింగ్ నేరాలు తీవ్రమైనవని, వాటిని అరికట్టాల్సిన అవసరం ఉందని, నిందితులపై రుజువు భారం న్యాయమేనని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇదిలాఉండగా, దేశ రాజధానిలోని నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రిక ప్రాంగణంలో, ఇతర చోట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు నిర్వహించిన ఒక రోజు తర్వాత ఈ ప్రకటన వచ్చింది. మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థ ప్రశ్నించింది.

విశాలాంధ్ర



# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాల్సిందే

- సీపీఐ మహాసభల అనంతరం ఉధృత పోరు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు. పక్కన శ్రీరామమూర్తి, రాజేశ్వరరావు, వెంకట్రావు, నరసింహులు, శంకరరావు, నారాయణస్వామి, గోపి

**విశాలాంధ్ర-శ్రీకాకుళం:** కేంద్రంలో మోదీ పాలన పేదలను దోచి కార్పొరేట్‌లకు కట్టబెట్టడమే పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రం లో జగన్ మాట తప్పి, మడమ తిప్పి పాలన సాగిస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రస్తుత ప్రభుత్వాలను గద్దె దించాల్సిందేనని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి దేశ అభివృద్ధి తిరోగమనం వైపు అడుగులు వేస్తుందని, కార్పొరేట్ శక్తులు చేతులలో మోదీ కీలు బొమ్మగా మారారని విమర్శించారు. దేశ సంపద అంబానీ, అదానీ వంటి వారికి కట్టబెట్టడం పనిగా పెట్టుకుని పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలకు అధిక భారాలు మోపుతున్నారన్నారు. రైతులు రుణం తీసుకుంటే వారి ఆస్తులు జప్తు చేస్తున్నారని, కార్పొరేట్‌లు తీసుకున్న లక్షల కోట్ల అప్పులను మాత్రం మాఫీ చేస్తూ దేశ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. పాలు, పెరుగు, పిల్లల చదువుకు అవసరం అయిన వాటి మీద జీఎస్టీ వేసి ప్రజల నుంచి దోచి వారి అనుబంధ కార్పొరేట్‌లకు కట్టబెట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో చిన్న చిన్న పరిశ్రమలు మూతపడ్డాయని, దేశంలో ఆర్ఎస్ఎస్ భావజాలంతో బీజేపీ ప్రభుత్వం పేట్రేగిపోతోందని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యారని, నిత్యావసరాల ధరలను ఆకాశాన్ని అంటేలా చేశారని, దేశాన్నీ ధరాఘాత భారతం చేసిన పాపం మోదీదే అన్నారు. రాష్ట్రంలో మద్యం విడతల వారీగా నిషేధిస్తామని చెప్పి మాట తప్పారనీ, నేడు రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందనీ, అదీ చాలదన్నట్లు ఇప్పుడు బార్లను బార్లా తెరవడానికి టెండర్లు పిలవడం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని, అధికారం వచ్చి మూడేళ్ల దాటినా వారికి పూర్తి న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, బాధితులు మళ్లీ పోరాటానికి సిద్ధం అవుతున్నారన్నారు. ఉద్యోగులకు సీపీఎస్ రద్దు అని చెప్పి మాట తప్పి జీపీఎస్‌ను తెరపైకి తెచ్చి ఉద్యోగులను మరోసారి మోసం చేడానికి సిద్ధమయ్యారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద వ్యతిరేకంగా నిశ్శబ్ద విప్లవం ప్రజల నుంచి మొదలైందని, ప్రజల తరపున సీపీఐ ముందుండి పోరాడుతుందన్నారు.

సీపీఐ రాష్ట్ర మహా సభలు ఈ నెల 26, 27, 28 తేదీల్లో విశాఖపట్నం లో, జాతీయ మహా సభలను అక్టోబరు 14 నుంచి 18 వరకు విజయవాడలో నిర్వహిస్తున్నామని, వాటిలో దేశ, రాష్ట్రంలోని పలు రాజ కీయ, ఆర్థిక అంశాల మీద చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని, మహాసభల అనంతరం పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, జిల్లా సహాయ కార్యదర్శులు జీ రాజేశ్వర రావు, ఎల్. వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సనపల నర్సింహులు, డోల శంకరరావు, ఎస్. నారాయణ స్వామి, యడ్ల గోపీ ఉన్నారు.

## అక్షయ గోల్డ్ బాధితుల పక్షాన పోరాడండి

### ముప్పాళ్లకు బాధితుల వినతి

**విశాలాంధ్ర-శ్రీకాకుళం:** అక్షయ గోల్డ్‌లో డిపాజిట్ చేసిన వారికి అవి అందక తీవ్ర ఇబ్బందులు, మనోవేదనకు గురవుతున్నామని, న్యాయం జరిగే వరకు తమ పక్షాన పోరాడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావును అక్షయ గోల్డ్ కష్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో ముప్పాళ్లను కలిసిన వినతి పత్రం అందించారు. అక్షయ గోల్డ్‌లో 2009లో చేరి తమతోపాటు చాలామందితో డబ్బులు కట్టించామని, మూడేళ్ల పాటు సక్రమంగానే పేమెంట్లు వచ్చేవన్నారు. కొన్ని కారణాలతో సంస్థపై సుమోటో కేసు నమోదు కావడంతో 2012 ఏప్రిల్‌లో కంపెనీ మూతపడిందని, ఆ డిపాజిట్‌లు ఇప్పటి వరకు బాధితులకు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఒత్తిడిని తట్టుకోలేక ఇప్పటికే 400 మంది బాధితులు మృతిచెందారని, చాలా మంది మనోవేదనతో వీధుల్లో తిరగలేని పరిస్థితిలో ఉన్నారని, అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన ఏవిధంగా ముందుండి పోరాడారో అలాగే తమ పక్షాన కూడా పోరాడాలని వారు ముప్పాళ్లను కోరారు. దీనిపై పూర్వపరాలు తెలుసుకొని అవసరం మేరకు అండగా ఉంటామని ముప్పాళ్ల బదులిచ్చారు. అక్షయ గోల్డ్ అసోసియేషన్ నాయకులు భోగి నూకరాజు, బాపి నాయుడు, కె. వెంకటరమణ, జి. గోవిందరావు, కె. రాజ్‌కుమార్, కె. వెంకటరావు తదితరులు ఉన్నారు.

### విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల

## సమస్యలు పరిష్కరించాలి

- ఆగస్టు 16 నుంచి నిరసనలు
- అక్టోబరు 20న చలో విద్యుత్‌సౌధ
- ఉద్యమ కార్యచరణ ప్రకటించిన జేఏసీ

**విశాలాంధ్ర-విజయవాడ(అజిత్‌సింగ్‌నగర్):** విద్యుత్ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాధాకృష్ణ మూర్తి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. బుధవారం విజయవాడలోని ఎంబివికె భవన్‌లో విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎం. బాలకాశి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రాధాకృష్ణ మూర్తితో పాటు రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎవి నాగేశ్వరరావు, విద్యుత్ కాంట్రాక్టు జేఏసీ నేతలు కట్టా నాగరాజు, ఎం. దుర్గారావు, సి.చంద్రశేఖర్, పి.శివయ్య, డి.సూరిబాబు, ప్రేమ్ కుమార్, దేవిడ్ రాజు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఏపీ విద్యుత్ రంగ సంస్థలైన ఏపీ జెన్కో, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ డిస్కం లలో రెండు దశాబ్దాలుగా పని చేస్తున్న 26 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు జీవితాలు చాలా దారుణంగా ఉన్నాయని పేర్కొనానరు. సరైన వేతనాలు, ఉద్యోగభద్రత లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్ తన పాదయాత్రలో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి మరచారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి మూడేళ్ల గడచినా సీఎం జగన్ తమ సమస్యలను పట్టించుకోకపోడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులరైజ్ చేయాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు తదితర డిమాండ్లతో రానున్న రోజుల్లో ఉద్యమాలను తీవ్ర తరం చేయాలని సదస్సులో నిర్ణయించారు. ఈ క్రమంలో ఆగస్టు 4 నుంచి 15లోపు అన్ని జిల్లాల్లో జేఏసీలు ఏర్పాటు చేసుకుని ఆగస్టు 16 నుంచి దశల వారీగా ఉద్యమాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 16 నుంచి 25 వరకూ జిల్లా సదస్సులు, 26 నుంచి సెప్టెంబర్ 1వ ప్రజా ప్రతినిధులకు లేఖలు రాయడం, సెప్టెంబర్ 5 నుంచి 26 వరకూ కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 6 నుంచి 12 వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకి హాజరవటం, 13న తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ ఆఫీసు ముందు నిరసన తెలపాలని సదస్సు తీర్మానించింది. అనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని విద్యుత్ సంస్థల కార్యాలయాలవద్ద ఆందోళనలు నిర్వహించాలని , ప్రభుత్వం దిగిరాక పోతే అక్టోబర్ 20న 'ఛలో విద్యుత్‌సౌధ' పేరుతో విజయవాడలో భారీ ఆందోళన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సదస్సులో ఉద్యోగ సంఘాల నేతలు ఎ.రాజేంద్రప్రసాద్, ఎ. రాజశేఖర్, స్వతంత్రకుమార్, వి.సాంబిరెడ్డి, పి.బాబు, ఎన్. చిన్నరామస్వామి, పి.శ్రీనివాసరావు, వి.రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## 'సీడ్స్' దోషులపై చర్యలు తీసుకోవాలి: జేవీఎస్ఎన్

**విశాలాంధ్ర-అనకాపల్లి:** అచ్యుతాపురం సీడ్స్ కంపెనీలో తరచూ గ్యాస్ లీకేజ్ ఘటనతో వందలాదిమంది మహిళా కార్మికుల ఆరోగ్యాలు పాడవడంతోపాటు పరిసర ప్రాంత ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, ఈ ఘటనలో కారకులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. సీడ్స్ పరిశ్రమలో వరుసగా జరిగిన రెండో సంఘటనపై, అందులో పనిచేస్తున్న మహిళా కార్మికులు అస్వస్థతకు గురై ఎన్టీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన కార్మికులను బుధవారం పరామర్శించారు. దుస్తుల పరిశ్రమలో రసాయనాలు తీవ్రస్థాయిలో వెలువడుతాయని, దానివల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఎయిర్ క్వాలిటీకి సాధారణ పరికరాలు పనిచేయవని, పరిశ్రమంలో వాడే యంత్రానికి అనుగుణంగా ఎయిర్ క్వాలిటీ పాటించాలన్నారు. పరిశ్రమంలో విష వాయువు లీకేజీ ఘటనను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సుమోటోగా స్వీకరించిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపురాజు, విత్తనాల పోతురాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## 'సీడ్స్' మూసివేత తగదు: ఓబులేసు

**విశాలాంధ్ర-అచ్యుతాపురం:** బ్రాండెక్స్ సీడ్స్ దుస్తుల పరిశ్రమలో వరసగా జరుగుతున్న ప్రమాదాలపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరపకుండా, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోకుండా కంపెనీని మూసివేస్తున్నామని ప్రకటించడం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ కంపెనీ యజమానులు అనుకూలంగా వ్యవహరించడం తగదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ ఓబులేసు విమర్శించారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం బ్రాండెడ్ సీడ్స్ పరిశ్రమలో విషవాయువు లీకై వందలాది మంది కార్మికులు అస్వస్థత గురయ్యారని, వారికి మెరుగైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. బ్రాండిక్స్ నిర్లక్ష్యం వల్లే కార్మికులు రెండుసార్లు కూడా తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, ప్రభుత్వం తక్షణమే ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపి బ్రాండిక్స్ ఇండియా భాగస్వామి దొరస్వామిని అరెస్టు చేయాలని, ఎస్ఈజెడ్‌లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం వాటిని నివారించడంలో ఘోరంగా విఫలమయ్యారని ఓబులేసు మండిపడ్డారు. యాజమాన్యాలు భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తు న్నాయన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా, అతి తక్కువ వేతనాలతో కార్మికులు పనులు చేస్తూ యాజమాన్యం లాభాలు గడిస్తున్న కంపెనీలపై నిరంతరం నిఘా ఉంచాలని, భద్రతా ప్రమాణాలు పాటించలేని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కంపెనీ మూసివేస్తే సెలవులతో కూడిన వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఉమామహేశ్వరి ఆత్మహత్యపై సీబీఐ దర్యాప్తు చేయాలి

### నందమూరి లక్ష్మీపార్వతి

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఎన్టీఆర్ కుమార్తె ఉమామహేశ్వరి ఆత్మహత్యపై సీబీఐ దర్యాప్తు జరపాలని వైసీపీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి డిమాండ్ చేశారు. తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎన్టీఆర్ కుటుంబంలో వరసగా విషాద ఘటనలు జరుగుతున్నాయని, హరికృష్ణ మరణమే జీర్ణించుకోలేకపోతుంటే, ఇప్పుడు ఎన్టీఆర్ చిన్న కూతురు ఆత్మహత్య చేసుకోవడం బాధ కలిగిస్తోందన్నారు. శవ రాజకీయాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, ఎన్టీఆర్ కుటుంబంలో ఒక శనిలా ప్రవేశించారని, అప్పటి నుంచి ఆ కుటుంబానికి కష్టాలు మొదల య్యాయని ఆరోపించారు. తనకు రాజకీయ భవిష్యత్తు ఉండదని భయపడిన చంద్ర బాబు, ఎన్టీఆర్ మరణానికి కారకులయ్యారని విమర్శించారు. హరికృష్ణకు మంత్రి పదవి ఇచ్చినట్టే ఇచ్చి ఆరు నెలల్లోనే లాగేసుకున్నారనీ, జూనియర్ ఎన్టీఆర్‌ను తన స్వార్థ రాజకీయాల కోసం వినియోగించుకున్నారని మండిపడ్డారు.

### ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తగదు: సీపీఎం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడం తగదని సీపీఎం తెలిపింది. కొత్త ఓటర్ల నమోదు, లేని ఓటర్లను జాబితా నుంచి తొలగింపు, అభ్యంతరాలపై చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించగా, సీపీఎం తరపున రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, జె.జయరామ్ హాజరయ్యారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడాన్ని తమ పార్టీ మొదటి నుంచి వ్యతిరేకిస్తోందని, విషయం సుప్రీం కోర్టు విచారణలో ఉన్నందున ప్రస్తుతం లింక్ చేయొద్దన్నారు. ఆధారం ఇవ్వడం అనేది స్వచ్ఛందం అని చెబుతున్నప్పటికీ, ఆచర ణలో మాత్రం యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి తప్పనిసరి చేస్తున్నారన్నారు. ఓటరు గుర్తింపు కోసం ప్రస్తుతం అమల్లోనున్న 11రకాల గుర్తింపు కార్డుల పద్ధతిని కొనసాగించాలని కోరారు.

## కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కుండపోత వర్షం

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- స్తంభించిన రాకపోకలు
- నదులను తలపిస్తున్న చెరువులు
- వాగులో కొట్టుకు పోయి వ్యక్తి మృతి

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు:** జిల్లాలో గత రెండు రోజులుగా కురు స్తున్న భారీ వర్షంతో వాగులు వంకలు పొంగిపొర్లు తున్నాయి. దీంతో పంటలు నీట మునిగాయి. రాకపోకలు నిలిచిపోయాయి. పలు చెరువుల్లో వరద నీరు వచ్చి చేరడంతో నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. సోమ, మంగళవారాల్లో విస్తృతంగా వర్షాలు కురవడంతో కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలో అత్యధికంగా 121 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఓర్వకల్లులో కుందూ నది పొంగి పొర్లుతోంది. గూడూరు మండలం పెంచికపాడులో రహదారులను వరద నీరు ముంచెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వక్కెరవాగులో ప్రమాదవశాత్తు కొట్టుకు పోయి మద్దిలేటి (52) మృతి చెందాడు. మంత్రాలయం మండలం మాధవరం, రచ్చుమర్రి, సుగులూరు, తిమ్మాపురం గ్రామాల్లో పంట పొలాల్లోకి నీరు చేరుకుంది. ఆస్పరి మండలం బిల్లేకల్లు, పుల్లకలమర్రి, వలకొండ ముత్తకూరు తదితర గ్రామాలల్లో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. పంటలు నీటమునిగాయి. జూపాడుబంగ్లా మండలం పారుమంచాలలో ఇసుకవాగు, కాకిలేరులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హోళగుంద మండలం వర్లమాడ సమీపంలోని వేదవతి నదికి వరదనీరు పోటెత్తింది. 10 అడుగుల మేర నీరు పారుతుండటంతో కర్నాటక రాష్ట్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. పాముల పాడు మండలంలో పొలాలు నీట మునిగాయి. డోన్ పట్ట ణంలోని శ్రీరామనగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నమల్కాపురంలో పంటలు నీట మునిగాయి. కొలిమిగుండ్ల మండలంలో చెరువులు నదులను తలపి స్తున్నాయి. మరో రెండురోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెపుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

### సీఎం తరపున ఎమ్మెల్సీలు పుష్పగుచ్ఛం అందజేత

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు సీఎం జగన్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం తరపున ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. చరవాణి ద్వారా గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవితం గడపాలని సీఎం ఆకాంక్షించారు. గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం ట్వీట్ కూడా చేశారు.

# కౌలురైతు కుటుంబాలను ఆదుకోండి

- పాలకులు నిర్లక్ష్యం వీడాలి
- అధికారులూ... సాకులు చెప్పొద్దు
- జీవో 43 సవరించాలి
- మానవ హక్కుల వేదిక డిమాండ్

**విశాలాంధ్ర- తిరుపతి:** పాలకుల నిర్లక్ష్యం కారణంగానే కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందనీ, దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే మదన శేఖర్, ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త వీఎస్ కృష్ణ, రైతు స్వరాజ్య వేదిక (ఆర్ఎస్‌వీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు బీ కొండల్ బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. రైతు ఆత్మహత్య కుటుంబాల నిజనిర్ధారణలో భాగంగా ఈ నెల 1న చిత్తూరు జిల్లాలోని శ్రీకాళహస్తి, నగరి, తిరుపతి డివిజన్‌లోని ఆరు గ్రామాల్లో 8 కుటుంబాలను కలిసి అసలు రైతులు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు, ప్రభుత్వం స్పందించిన తీరుపై పూర్తి వివరాలు సేకరించినట్టు పేర్కొన్నారు. రెండు నెలల క్రితం సత్యసాయి జిల్లాలో జరిగిన బహిరంగసభలో పాస్ బుక్ ఉండి ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు తాము ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదని నిరూపించగలరా అని సీఎం జగన్ ప్రతిపక్షాలకు చేసిన సవాల్‌లో నిజం లేదని అది ఒట్టి బుకాయింపు మాత్రమేనని స్పష్టం చేశారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు ఎలాంటి సహాయం అందలేదని అన్నారు. అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలురైతు గుర్తింపు కార్డు లేదనో, అసైన్డ్ భూమనో సాకులు చెప్పి విచారణ చేపట్టకుండా ఎక్స్‌గ్రేషియా తిరస్కరించడం దారుణమన్నారు.

కేవీబీ పురం మండలం కర్లపూడిలో టీ వెంకటేశ్వరరెడ్డి ఆత్మహత్య చేసుకోగా తమకు న్యాయం చేయాలంటూ అతడి కుమార్తె అనిత(22) అధికారులను వేడుకుందనీ, మీ తండ్రిది ఆత్మహత్య కిందకురాదు.. బోర్లువేస్తే ఇంత ఖర్చు అవుతుందా... వర్షాలు పడ్డాయి కదా... మీ తండ్రికే నష్టం వచ్చిందా అంటూ క్షోభకు గురిచేయడం దుర్మార్గమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనివాసపురంలో డీ ఏలుమలై అనే రైతు ఆత్మహత్య చేసుకోగా వారం రోజుల తరువాత కుటుంబ సభ్యులు అధికారులను కలిస్తే విచారణ చేపట్టడం సాధ్యం కాదని తిప్పి పంపడం హేయమన్నారు. 24 గంటల లోపు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించాల్సిన త్రిసభ్య కమిటీ బాధితుల వద్దకు ఎందుకు రావడం లేదో అంతుబట్టడం లేదన్నారు.

అదేవిధంగా శ్రీకాళహస్తి డివిజన్‌లో కే మోహనాచారి (45), సీ. వేణు(57), చిత్తూరు జిల్లా, నగరి డివిజన్ లో కే జయంతి(53), విజయపురం మండలంలో ఎం రఘుపతి(43), పుత్తూరు మండలంలో ఎం.భాస్కర్ మందడి(55), కార్వేటి నగరం మండలంలో ఎస్.భూపాలయ్య మృతి చెందితే అధికారులు పట్టించుకోలేదన్నారు. ఎనిమిది మంది ఆత్మహత్యకు పాల్పడితే కేవలం ఒకే ఒక్క కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రావడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతుందన్నారు. విజయపురం మండలం కాలికాపురంలో రఘుపతి అనే రైతు ఆత్మహత్య చేసుకుంటే ఎమ్మెల్యే రోజా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రెండేళ్లవుతున్నా నేటికీ విచారణకు అధికారులు రాకపోవడం అన్యాయమన్నారు. జీవో 43 సవరించి, ఆర్థిక సాయం, పునరావాసం కల్పించి ఆయా రైతు కుటుంబాలను ఆదుకోవాలని హెచ్ఆర్ఎఫ్, ఆర్ఎస్‌వీ సంఘ నేతలు డిమాండ్ చేశారు.

## 'ఉక్కు' ప్రభుత్వరంగంలోనే కొనసాగాలి

### 538వ రోజుకు రిలే దీక్షలు

**విశాలాంధ్ర - కూర్మన్నపాలెం:** విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ బుధవారం డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు బుధవారం నాటికి 538 వ రోజుకు చేరుకున్నాయి. ఆదినారాయణ మాట్లాడుతూ, విశాఖ ఉక్కును అమ్మేస్తామని కేంద్రం పదే పదే ప్రకటనలు చేయడం సరైంది కాదనీ, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. పోరాటాలు పజలకు, ఉక్కు కార్మిక వర్గానికి కొత్తేమీ కాదని, కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యంగా ఎదుర్కొంటామని అన్నారు. కేంద్రం తన విధానాలను మార్చుకొని, పునరాలోచించాలని లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు పూనుకోవలసి వస్తుందని హెచ్చరించారు. వరసాల శ్రీనివాసరావు, సి. హెచ్.సన్యాసిరావు, ఎన్.రామారావు, నెల్లి అప్పలరాజు, కె.బాబా, టి.గోపి, జయకుమార్, గోవింద రాజు,పి.సూర్యనారాయణ, వైకుంఠం, జి.వేణుగోపాల్ రావు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# కుంపటి రాజేసిన పెలోసీ

రష్యా-ఉక్రైన్ యుద్ధం మొదలై ఆరు నెలలు కావస్తోంది. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుపట్టడం లేదు. ఈ తరుణంలో అమెరికా పార్లమెంటు ఎగువసభ స్పీకర్ నాన్సీ పెలోసీ హఠాత్తుగా బుధవారం తైవాన్ లో పర్యటించి మరో కుంపటి రాజేశారు. తైవాన్ చైనాలో అంతర్భాగమని చైనా అంటోంది. ఒకే చైనా అన్న వాదనను అమెరికాతో సహా ఐక్య రాజ్య సమితి, భారత్ కూడా అంగీకరిస్తాయి. కానీ తైవాన్ లో స్వయంపాలన ఉంది. తమది ప్రజాస్వామ్యం అని ఆ దేశాధ్యక్షురాలు త్సాయ్ ఇంగ్-వెన్ వాదిస్తూ ఉంటారు. సైనిక చర్యకు దిగి అయినా సరే తైవాన్ మీద ఆధిపత్యంకోసం కృషి చేస్తామని చైనా అంటుంది. నాన్సీ పెలోసీ తైవాన్ పర్యటన సందర్భంగా చైనా తమ భూభాగానికి, తైవాన్ కు మధ్య ఉన్న క్రాస్ జలసంధిలో సైనిక విన్యాసాలు ప్రారంభించింది. పెలోసీ విమానాన్ని తైవాన్‌లో దిగనివ్వం అవసరమైతే పేల్చేస్తామని హెచ్చరించినా చైనా అంత దూకుడు ప్రదర్శించలేదు. పెలోసీ తైవాన్ లో పర్యటించడమే కాక అక్కడి చట్టసభ సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. తైవాన్ కు అమెరికా మద్దతు ఉంటుందని చెప్పారు. కానీ అమెరికా సైతం ఒకే చైనా అన్న భావనకే 1970 నుంచి ఇప్పటివరకు కట్టుబడి ఉంది. తైవాన్ ను చైనాలో అంతర్భాగంగానే గుర్తిస్తోంది. అయితే అమెరికా ద్వంద్వ నీతిలో భాగంగా తైవాన్ తో అమెరికా అనధికారిక సంబంధాలు కొనసాగిస్తూనే ఉంది. కావాలనే అమెరికా సందిగ్ధ వైఖరి అనుసరిస్తూ ఉంటుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాత్రం నాన్సీ పెలోసీ తైవాన్ పర్యటనకు వెళ్లకుండా నివారించలేదు. సుతి మెత్తగా మాత్రమే ఒద్దన్నారు. నాన్సీ పెలోసీ ముందు నుంచి తైవాన్ వ్యవహారంలోనే కాక హాంగ్ కాంగ్ విషయంలోనూ దూకుడు వైఖరినే అనుసరిస్తున్నారు. అనేక అంశాలలో చైనా విధానాలను పెలోసీ వ్యతిరేకిస్తూనే ఉన్నారు. మరో వేపు తైవాన్ ను స్వతంత్ర దేశంగా భావించడాన్ని చైనా ససేమిరా సహించదు. చైనా దృష్టితో చూస్తే పెలోసీ స్థాయి వ్యక్తి తైవాన్ లో పర్యటించడం అంటే తైవాన్ స్వాతంత్ర్యాన్ని సమర్థించడం. తమ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను సవాలు చేయడమే. ఇలాంటి వైఖరి అమెరికాతో చైనాకు ఉన్న సంబంధాలకు విఘాతం కలిగిస్తుందని చైనా భావిస్తుంది. పెలోసీ పర్యటన వల్ల తైవాన్‌లో స్వాతంత్ర్యం కోరే వారికి మద్దతు ఇచ్చినట్టేనని చైనా అంటోంది. తైవాన్ కు స్వతంత్ర రాజకీయ అస్తిత్వం ఉండడాన్ని చైనా అంగీకరించదు. చైనాకు తైవాన్ కు మధ్య రాజకీయపరమైన స్పర్థలు ఉన్నప్పటికీ ఆర్థిక సంబంధాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. తైవాన్ కు చెందిన అనేక మంది చైనా ప్రధాన భూభాగంలో పని చేస్తూనే ఉంటారు. అలాగే తైవాన్ లో చైనా పెట్టుబడులూ ఉన్నాయి. ఐక్య రాజ్య సమితి తైవాన్ ప్రత్యేక అస్తిత్వాన్ని అంగీకరించదు. దక్షిణ అమెరికా, కరేబియన్ ప్రాంతంలోని 13 దేశాలతో పాటు వాటికన్ తైవాన్ ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తిస్తున్నాయి. అమెరికా తైవాన్ ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తించకపోయినా తమ సందిగ్ధ విధానానికి అనువుగా అమెరికా అధ్యక్షుడు బైడెన్ గత జూన్ లో తైవాన్ స్వతంత్ర అస్తిత్వాన్ని గుర్తించబోము అంటూనే ఎవరైనా దాడి చేస్తే మాత్రం తైవాన్ ను సమర్థిస్తామన్నారు. పెలోసీ తైవాన్ చట్టసభ సభ్యులను ఉద్దేశించి అమెరికా మద్దతు ఉంటుందని చెప్పడానికి సాహసించడానికి ఈ సందిగ్ధతే కారణం. అమెరికా తైవాన్ కు ఆయుధాలు సరఫరా చేయడం ద్వంద్వ విధానానికి పరాకాష్ఠ. 1997లో కూడా అప్పటి అమెరికా ఎగువ సభ స్పీకర్, రిపబ్లికన్ పార్టీ నాయకుడు గింగ్రిచ్ తైవాన్ లో పర్యటించారు. దాడి చేస్తే తైవాన్ కు అండగా నిలబడతామని కూడా చెప్పాడు. ఆ సమయంలో చైనా పెద్దగా రభస చేయలేదు. ఆ తరవాత తైవాన్ లో పేరున్న అమెరికా నాయకుల పర్యటన పెలోసీదే. ఆర్థికంగా ఇప్పుడున్నంత బలంగా ఆ రోజుల్లో చైనా లేకపోవడమే దీనికి కారణం. 2016లో స్వాతంత్ర్య కాంక్ష వ్యక్తం చేసే పార్టీకి తైవాన్ ప్రజలు పట్టం కట్టారు. చైనాలో మానవ హక్కుల కోసం పాటు పడే వ్యక్తిగా పేరుండడంవల్ల పెలోసీ తైవాన్ పర్యటనకు పరిస్థితులు అనుకూలించినట్టున్నాయి. 1991లో ఇతర అమెరికా రాజకీయ నాయకులతో కలిసి ఆమె చైనాలో పర్యటించారు. తియాన్‌మెన్ స్క్వేర్ లో జరిగిన హింసాకాండ రెండవ వార్షికోత్సవం అన్న మిషతో అప్పుడు పెలోసీ తదితరులు ఒక పతాకం లాంటిది ఆవిష్కరించారు. 2009లోనూ పెలోసీ చైనా వెళ్లి రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని చైనా అధ్యక్షుడు హూ ను కోరారు.

1995లో అప్పటి తైవాన్ అధ్యక్షుడు లీ తెంగ్ హూయ్ అమెరికాలో పర్యటించినప్పుడు కూడా చైనా తైవాన్ పరిసరాల్లో క్షిపణులు ప్రయోగించింది. సైనిక విన్యాసాలు నిర్వహించింది. అప్పటితో పోలిస్తే చైనా సైనిక శక్తి ఇప్పుడు చాలా పెరిగింది. ఈ దశలో చైనాను రెచ్చగొట్టడం అంటే మరో యుద్ధానికి తెరతీయడమే. ఇంకో వేపు తైవాన్ అధ్యక్షురాలు త్సాయ్ అమెరికా, యూరప్, ఆసియా నుంచి ప్రముఖులను ఆహ్వానించడంలో నిమగ్నమై ఉన్నారు. అమెరికా అండ లేకుండా చైనాను ఎదిరించడం కుదరదు కనక త్సాయ్ సైనికంగా బలం పుంజుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పెలోసీ పర్యటన తమను రెచ్చగొట్టడమే కనక తాము తైవాన్ పరిసరాల్లో సైనిక విన్యాసాలు చేస్తున్నామని తమది ప్రతిక్రియ మాత్రమేనని చైనా అంటోంది. అమెరికా, తైవాన్ రెచ్చగొట్టే ధోరణి వల్లే తాము సైనిక బలాన్ని ప్రదర్శించవలసి వస్తోందని చైనా అంటోంది. ఉత్తర, నైరుతి, ఆగ్నేయ ప్రాంతంలోని జలసంధి జలాల్లోనూ, వైమానికంగానూ తమ సైనిక శక్తిని ప్రదర్శిస్తామని చైనా చెప్తోంది. ఒకే చైనా అన్న భావనను అమెరికా అంగీకరించిన తరవాతే అమెరికా-చైనా మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయి. చెప్పిన మాటలకు, చేసిన వాగ్దానాలకు కట్టుబడే లక్షణం అమెరికాకు ఏనాడూ లేదు. అనేక సంవత్సరాలుగా అమెరికా నుంచి తైవాన్ కు ఆయుధ సరఫరా కొనసాగుతూనే ఉంది. 1982 నాటి స్థాయి నుంచి తైవాన్ కు ఆయుధ సరఫరా తగ్గిస్తామన్న మాటను కూడా అమెరికా నిలబెట్టుకోలేదు. పైగా ఆయుధ సరఫరా పెరిగింది. అమెరికా అధ్యక్షుడిగా ఎవరున్నా ఆయుధ సరఫరా బలాదూరుగా సాగుతోంది. దక్షిణ చైనా సముద్రంలో అమెరికా సైనిక విన్యాసాలు ఆగనే లేదు. చైనాతో అమెరికాకు మంచి వాణిజ్య సంబంధాలు ఉన్నప్పటికీ ఇలా రెచ్చగొట్టే ధోరణిలో వ్యవహరించడం అంటే ఆయుధాలు విక్రయించడానికే ప్రాధాన్యం ఇస్తోందనుకోవాలి. వాస్తవం కూడా అదే. గిల్లి కజ్జాలు పెట్టుకోవడం అమెరికా పాలకుల నైజం. మన సరిహద్దుల్లో చైనా కవ్వింపు వైఖరి అనుసరిస్తున్నందువల్ల భారత విధానం మరింత స్పష్టంగా ఉండాల్సిందే. అయితే ప్రభుత్వ విధానం ఏమిటో ఇంతవరకు బయట పడలేదు.

# బడుగుల కార్పొరేషన్లతో ఒరిగిందేమిటి ?

డా. ముచ్చుకోట సురేష్ బాబు

ఎంతో ఆర్భాటంగా బీసీల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన 56 కార్పొరేషన్ల పాలక మండళ్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించి రెండు సంవత్సరాలవుతుంది. మొత్తం 139 బీసీ కులాలకు గానూ ప్రస్తుతం 56 కార్పొరేషన్లు సృష్టించి 728 చైర్మన్, డైరెక్టర్ల పదవులను ఎవరి కులపరిధిలో వారికి ఇచ్చారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించగా, చైర్మన్, డైరెక్టర్ పదవుల్లో అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించామని చెబుతున్న వాస్తవానికి చాల జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు. రాష్ట్రంలో ఉన్న కీలకమైన పదవులు, రాష్ట్ర సంపద లభించే పదవులు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, హైకోర్టు జిల్లా కోర్టుల జీపీలను, స్కిల్ దెవలప్మెంట్, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, సమాచార కమిషనర్ల, సలహాదారులు అంతా రెడ్లే. ఆర్థికంగా పటిష్టంగా ఉన్న శాఖలు, ఆదాయ వనరులున్న శాఖల నామినేటెడ్ పదవులు రెడ్డి సామజిక వర్గానికి 720 పైగా ఇచ్చారు. విద్య, ఆరోగ్యం, ప్రాజెక్టులు, స్కిల్ డెవెలప్మెంట్, మీడియా, టెంపుల్ కమిటీలు, మార్కెట్ కమిటీలు, విశ్వవిద్యాలయాల పాలకమండలి సభ్యులు, రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర ఇంచార్జులు, స్థానికంగా ఉన్న రేషన్ షాపులు, ఆహార పంపిణీ, వంట ఏజెన్సీ, డిష్, కేబుల్ నెట్, రవాణా ఏజెన్సీ, కస్టమర్ హైరింగ్ సెంటర్లు, డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్లు అది ఇది అని కాదు లాభం వచ్చే అన్ని రంగాల్లో ఈ కులస్తులు తిష్టవేశారు.

బీసీ కులాల అభివృద్ధికి పాటు పడుతున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఆచరణలో ఈ కులాల అభివృద్ధికి కనీస చర్యలు తీసుకోవడం లేదు. అత్యంత వెనుకబడిన కులాలు, సంచార జాతులను ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, సామాజిక రంగాల్లో అభివృద్ధి చేయవలసిన రాజ్యాంగ బాధ్యతను ఈ ప్రభుత్వం విస్మరిస్తోంది. సమాజం ఎప్పటికప్పుడు మారుతుంది. ప్రజల్లో కూడా దానికి అనుగుణంగా మార్పులు వస్తున్నాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. అన్ని రంగాల్లో యాంత్రీకరణ పెరుగుతోంది. ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక, వ్యవసాయ, సాంస్కృతిక రంగాల్లో వేగంగా మార్పులు జరుగుతున్నాయి.

ఆధునిక సాంకేతికత అన్ని రంగాలకూ విస్తరిస్తోంది. ఈ పరిణామ క్రమంలో కులవృత్తులు, చేతివృత్తులు తమ ఆస్థిత్వాన్ని కోల్పోతున్నాయి. ఇంతవరకు ఈ వృత్తులపైనే ఆధారపడిన కులాలు, వర్గాలకు యాంత్రీకరణ, కార్పొరేటీకరణ దక్కాలి. కానీ ప్రస్తుతం వ్యవస్థలో అలా జరగడం లేదు. స్టీల్, ఐరన్ పరిశ్రమలతో కమ్మరి, కుమ్మరి, వడ్రంగి కులాలు తమ వృత్తులను కోల్పోయాయి. ప్లాస్టిక్ పరిశ్రమ కారణంగా మేదరి, కుమ్మరి వృత్తులు మరుగున పడ్డాయి. జేసీబీలు, హిటాచీ మెషిన్లతో వడ్డెర్ల బతుకులు ఆగమై కూలీలుగా మారారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇంకా అనేక వృత్తులు దెబ్బతిన్నాయి.

ప్రతి దరఖాస్తుదారునికి సబ్సిడీ రుణాలు ఇస్తామని ప్రకటించారు. మరోవైపు రెండేండ్లుగా కొత్త రుణాల కోసం నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు. దీంతో దరఖాస్తు చేసుకోవడానికి లక్షల మంది ఎదురు చూస్తున్నారు. బీసీ కార్పొరేషన్లు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. కులాల సమస్యలపై అవగాహన ఉన్న వారు తమకు కావలిసిన పథకాలను డిజైన్ చేయగలరు, కానీ కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్ల నియామకం అస్తవ్యస్తంగా తమ చెప్పుచేతల్లో ఉన్న వారికి ఇచ్చారు. సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినా స్పందించడం లేదు. కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా ఆయా కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను కింది స్థాయిలో అర్థం చేసుకుని పరిష్కరించే అవకాశం కలుగుతుంది. మిగతా కులాలకు ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా, సంచార జాతుల కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటే ఈ కులాల్లో సమగ్ర అభివృద్ధికి పునాదులు పడతాయి. మరోవైపు కరోనా మహమ్మారి దెబ్బతో కుల వృత్తులు, చేతి వృత్తులు దెబ్బతిన్నాయి. కరోనా కల్లోలంతో దెబ్బతిన్న కుల వృత్తుల కుటుంబాలకు ఎలాంటి సహాయం లేదు.

కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వకపోగా.. బీసీలకు రూ.లక్ష- రూ.2 లక్షల రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు కూడా ముందుకు రావడం లేదు. కానీ, బడా కంపెనీలకు, పారిశ్రామిక వేత్తలకు వేల కోట్ల రుణాలు ఇస్తున్నారు. ఇప్పటికైనా బ్యాంకులు తమ వైఖరి మార్చుకుని బీసీలకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలి. ఇన్పుట్ సబ్సిడీ, పంట నష్టము అంచనా వేయక రైతులను భ్రష్టు పట్టించిన ఘనత మన కేంద్ర రాష్ట్ర ప్రభుతలదే. నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు 50శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చట్టం తెచ్చిన అమలు చేయలేదు.

వ్యాస రచయిత అధ్యక్షులు, గౌతమ్ బుద్ధ అభివృద్ధి సమాఖ్య.

# బ్రాండిక్స్ ప్రమాదాలపై ఇంత నిర్లక్ష్యమా...

జె.వి.సత్యనారాయణ మూర్తి

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని సెజ్‌లో వరుసగా జరుగుతున్న విషవాయువుల లీకేజీ ఘటనలు ప్రజాసమూహాల్ని, కార్మిక లోకాన్ని తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. రెండు నెలల్లో రెండు సార్లు విషవాయువులు లీక్ అవడం మరింత ఆందోళనకు కారణమవుతోంది. సెజ్‌లోని, బ్రాండిక్స్ వస్త్ర పరిశ్రమలో జూన్ 3 వ తేదీన లీకైన విషవాయువు కార్మిక లోకంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పరిశ్రమలో పని చేస్తున్న వందల మంది ఆ విషవాయువు ప్రభావానికి లోనయ్యారు. విషవాయువు లీక్ అయిన తరుణంలో ఘాటైన వాసనలు ఆ చుట్టపక్కల వేగంగా వ్యాప్తి చెందిన క్రమంలో అక్కడ పని చేస్తున్న వందల మంది కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది పరిశ్రమ బయటకు పరుగులు పెట్టారు. శ్వాస తీసుకోవడంలోనే తీవ్ర ఇబ్బందులు పడుతూ పరిశ్రమ బయటకు పరుగులు తీయడాన్ని ప్రజలంతా గమనించారు. విషవాయువుల ప్రభావానికి లోనైన వారంతా అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. ఎక్కడికక్కడ కుప్పకూలారు. వారందరినీ ఆసుపత్రికి తరలించినా వెంటనే కోలుకోలేనంతగా ఆ విషవాయువుల ప్రభావానికి లోనయ్యారనే విషయం తెలిసిందే. మంగళవారం నాటి ప్రమాదంలోనూ ఇదే తరహా సీన్ పునరావృతం అవడం చాలా విషాదకరం.

జూన్ 3న సెజ్‌లో ఉన్న సీడ్స్ ఇంటిమేట్ అప్‌రెల్ (బ్రాండెక్స్) సంస్థలో జరిగిన ఈ ప్రమాదం పట్ల ప్రభుత్వం, యాజమాన్యం చాలా చిన్న సమస్యగా పరిగణించినట్టు తాజా ప్రమాదంతో స్పష్టమైంది. నాడు విషవాయువులు లీక్‌పై ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం అవడంతోనే వరుస ప్రమాదాలకు బ్రాండిక్స్ నెలవుగా మారింది. జూన్ 3 నాటి ప్రమాదంలో తొలుత అమ్మోనియా వాయువు లీక్ అవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని, అనంతరం క్లోరిన్ వాయువు కారణమని రకరకాల కారణాల్ని ప్రస్తావిస్తూ అసలు ప్రమాదం జరిగిన సంస్థపై చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించలేదు. కేవలం వాయువులు లీక్ అవడానికి కారణం పోరస్ లేబరేటరీ అని భావించి దాన్ని రెండు రోజులు మూసివేయాలని ఆదేశించి చేతులు దులుపుకుంది. విషవాయువులు లీకైనట్టు చెబుతున్న పోరస్ ల్యాబ్స్‌లో అమ్మోనియా, క్లోరిన్ రసాయినాల వాడకం లేదని తెలుస్తోంది. పైగా ఆ ల్యాబ్ బ్రాండెక్స్‌కు పరిశ్రమకు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. నిజంగానే పోరస్ ల్యాబ్‌లో విషవాయువులు లీక్ అయి ఉంటే అక్కడున్న ఎమర్జెన్సీ విభాగం స్పందించి ఉండాలి. తప్పు వారిదే అయి ఉంటే సహాయక చర్యలు అయినా చేపట్టి

ఉండాలి. అవేవీ జరుగలేదు. పైగా పోరస్ ల్యాబ్ వద్ద ఉన్న చెట్లపై లీకైనట్టు భావిస్తున్న విషవాయువుల ప్రభావం ఏమాత్రం కనిపించలేదు. ఈ క్రమంలో విషవాయువులు బ్రాండిక్స్‌లోనే లీకైనట్టు తెలుస్తోంది. విశాఖలో జరిగిన ఘోర ప్రమాదం అయిన హిందుస్తాన్ పాలిమర్స్ ప్రమాదం ఉదంతంలో మనుషులే కాక పక్షులు, పశువులు, చెట్లు ఎలా నాశనమయ్యాయో అందరి కళ్ళముందు ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా జరగుతున్న ప్రమాదాలపై యాజమాన్యాలు సహా ప్రభుత్వం వైపు నుంచి కూడా వాస్తవ విరుద్ధమైన ప్రకటనలు వెలువడు తున్నాయి. ప్రమాదం ఎక్కడ, ఎలా జరిగిందన్న అంశంపై పూర్తి స్థాయిలో పరిశీలన చేయాల్సిన కాలుష్య నియంత్రణ మండలి కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. స్పందించినా చేపట్టింది తూతూ మంత్రం చర్యలే.

ఆ పరిశ్రమలో జరుగుతున్న వరుస ప్రమాదాల పట్ల ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనేది సుస్పష్టం. గతంలో ప్రమాదం జరిగిన తరుణంలో ఆ పరిశ్రమలో పని చేస్తున్న బాధితులను పరామర్శించినప్పుడు అనేక విషయాలను సీపీఐ ప్రతినిధి బృందంగా గమనించాము. వాయువుల ప్రభావానికి లోనైన బాధితుల్లో పురుషులు మాత్రం రెండు రోజుల్లో కోలుకున్నట్టు గుర్తించాం. మహిళలపై ఆ విషవాయువుల ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. విషవాయువులు మహిళలపై ఎక్కువ ప్రభావం చూపిన కారణంగానే వారు చాలా ఆలస్యంగా కోలుకున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో బాధిత మహిళలు దీర్ఘకాలంలో కేన్సర్ వంటి భయంకర వ్యాధుల బారినపడే అవకాశం ఉందనే భయం నెలకొంది. శ్వాసకోశ, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలతో పాటు గుండె జబ్బులకు గురయ్యే అవకాశాలుంటాయనే ఆందోళనా ఉంది. రుతుక్రమంలోనూ సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉన్నట్టు తెలుస్తోంది.

సీపీఐ అంచనాలకు, ఆ ప్రమాదంపై పరిశీలన జరిపిన రసాయనిక శాస్త్రవేత్తల అంచనాలకు దగ్గర సంబంధం వెలుగులోకి వచ్చింది. జూన్ 3న జరిగిన ప్రమాదంపై 24 మంది రసాయన శాస్త్ర ఆచార్యులు ఒక పరిశీలన చేపట్టారు. తాము గ్రహించిన అంశాలను రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారికి ఒక బహిరంగ లేఖ రాశారు. అందులో పరిశ్రమల్లో వినియోగించే రసాయినాల కారణంగా విడుదలయ్యే విషవాయువుల ప్రభావం బాధితులపై ఏ మేరకు ఉండే అవకాశం ఉందో సవివరంగా ప్రస్తావించారు. ప్రధానంగా బట్టల పరిశ్రమల్లో వినియోగించే రసాయినాల ద్వారా ఏర్పడే ప్రమాదాలపై పరిశోధనాత్మకంగా ఆ లేఖలో పొందుపరచారు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన పరిశోధనల ఫలితాలను కూడా ఆ లేఖకు జతపరిచారు. తాజా ప్రమాదంలో విషవాయువులు పీల్చుకున్న వారు క్యాన్సర్ ముప్పును ఎదుర్కొనే అవకాశాలు బలంగా ఉన్నట్టు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఈ బట్టలు తయారు చేసే పరిశ్రమలలో చేసిన పరిశోధన పత్రాలు కూడా జత చేశారు. వస్త్ర పరిశ్రమలోనే వివిధ ప్రమాదకర రసాయనాలు వాడుతున్నట్టు తెలిపారు. వస్త్ర పరిశ్రమల్లో వినియోగించే రసాయినాల వివరాలను ముందుగానే అక్కడ పని చేయాలని భావించే వారికి వివరించి వారి ఇష్ట ప్రకారమే పని చేయించుకోవాల్సిన నియమాలున్నట్టు గుర్తు చేశారు. సీపీఐ ప్రమాదానికి గల కారణాలపై అధ్యయనం చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని అర్థమవుతోంది.

ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీ నివేదిక ఇచ్చినా దాన్ని బహిర్గతం చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యం అవుతుంది. రెండు నెలల కిందట జరిగిన ప్రమాదంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టి ఉంటే మళ్లీ అదే పరిశ్రమలో మరో ప్రమాదం జరిగి ఉండేది కాదు. గాలి నాణ్యతను పరిశీలించేందుకు సాధారణ యంత్రాలనే యాజమాన్యం వాడుతోందనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. నిర్దుష్టమైన భద్రతా చర్యలు చేపట్టకపోవడంతోనే ఆ పరిశ్రమలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా యాజమాన్యం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడం దారుణం. ప్రజలు ప్రాణాలు పోతే తప్ప ఏపీ ప్రభుత్వం, కాలుష్య నియంత్రణ మండలి సరైన చర్యలు తీసుకోలేమనే చందాన వ్యవహరిస్తున్నదని భావించాలి. ఇప్పటికైనా వరుస ప్రమాదాలకు కేంద్రంగా మారిన ఆ పరిశ్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకుని బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

వ్యాస రచయిత సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి.

# జీఎస్టీ: పన్ను నొప్పి

ఐ-మెయిల్

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి మాట్లాడుతూ ప్యాకెట్‌లో అమ్మే పెరుగు,మజ్జిగ,పప్పులు, గోధుమ పిండి లాంటి నిత్యావసర ఆహార పదార్థాలపై కొత్తగా విధించిన ఐదు శాతం జీఎస్టీ వల్ల సామాన్యులు ఏమీ భారంగా ఫీల్ అవడం లేదంటూ చెప్పారు. నిజమే కదా! పేదలు ఎటూ కొనే స్థితిలో లేరు కాబట్టి అదనపు భారం లేదు.మధ్య తరగతి జీవులు ఇప్పటికే నిండా మునిగే ఉన్నారు కాబట్టి కొత్తగా వేసే చలి ఏమిటి అనుకుని భారం ఫీల్ అవ్వడం లేదు. అయితే ఈ నిర్ణయం కేంద్ర, రాష్ట్రాలు ప్రతినిధులుగా ఉన్న జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం అని, అప్పుడెవరూ అభ్యంతరం చెప్పలేదని మంత్రి చెప్పడం మాత్రం భావ్యంగా లేదు. ఒకరు చెప్పినా చెప్పకపోయినా మొదట్లోనే చెప్పారు కదా ఆహార పదార్థాలపై ఎలాంటి పన్నూ ఉండబోదని. ఇప్పుడు వాటిని కూడా పన్నుల పరిధిలోకి తీసుకువచ్చి సామాన్యుడిపై భారం మోపడం తగదు. ఆర్థిక సంక్షోభం, ప్రతికూల వాతావరణంలో ఆహార భద్రత, అధిక ధరలు, ఉపాధి లేమి లాంటి పరిస్థితుల్లో ఇలా పన్నులు పెంచుతూ పోవడం ప్రజలకు అదనపు భారమే. వైద్య పరికరాల దిగుమతులపై కూడా పన్ను పెరిగింది. అది ఎటు తిరిగీ వైద్య సేవలు పొందే రోగులపైనే పడుతుంది. ఇప్పటికే జీఎస్టీ ద్వారా పన్నుల వసూళ్లు ఏటికేడు పెరుగుతూ ఉన్నాయి. ఈ సంవత్సరం జీఎస్టీ వసూళ్లు 28 శాతం గతం కన్నా అధికంగా జరిగినట్లు, ఇది ఈ పరోక్ష పన్నుల సంస్కరణ జరిగాక రెండో అధిక మొత్తం అన్నట్లు వార్త. ఆర్థిక కలాపాలు కరోనా తర్వాత గాడిలో పడుతున్నట్లు కేంద్రం సంతోషపడవచ్చు. కానీ అవి ప్రజలకు ఎంత భారంగా ఉన్నాయో కూడా గుర్తించాలి. సొంత లాభం కొంత వదులుకొని ప్రజలకు పన్ను నొప్పి నుండి ఊరట నివ్వాలి. అంతే గానీ పన్ను కొంచెం, నొప్పి మిధ్య అని మాట్లాడితే పరిహాసం లా ఉంటుంది. ఆహార పదార్థాలపై విధించిన పన్ను నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం, ఇంధనాన్ని జీఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చి ధరలు విపరీతంగా పెరగకుండా ఒక సీలింగ్ విధించడం కేంద్రం చెయ్యాలి.

– డా. డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, 94408 36931.

# మానవీయతను మరిచిన అధికారులు

ఎస్.మునెప్ప

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 15 ఏళ్లకు పైగా రోగులకు సేవలందిస్తున్న 107 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. వీరిలో ల్యాబ్ టెక్నీషియన్స్, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషయన్లు, ఫార్మసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లున్నారు. కర్నూలు జిల్లా కలెక్టర్ అనుమతితో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ద్వారా నియమితులయ్యారు. ఒక్క కలంపోటుతో హాస్పటల్ సూపరింటెండెంట్ మార్చి 31న మూడు ఏజెన్సీలో పనిచేస్తున్న వారిని తొలగిస్తున్నామని సంబంధిత ఏజెన్సీ తెలిపింది. ఇది ఎంతవరకు కరెక్ట్, ఇది ఎక్కడ న్యాయం?

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను ఇలా తొలగించవచ్చా? లేబర్ యాక్ట్ ప్రకారం ఔట్ సోర్సింగ్ కార్మికులను తొలగించాలంటే మూడు నెలల ముందు నోటీసులు ఇవ్వాలి. వారి జీతభత్యాలు చెల్లించాలి. పిఎఫ్, ఇఎస్ఐ సెటిల్మెంట్ చేయాలి. తొలగించినా తర్వాత మూడు నెలల జీతాలు చెల్లించాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులను తొలగించిన ఆ ఉద్యోగం తిరిగి ఔట్ సోర్సింగ్ కార్మికులతోనే భర్తీ చేయరాదు. చట్టనిబంధనలు పాటించకుండా, ఎలాంటి ముందస్తు హెచ్చరికలు నోటీసులు ఇవ్వకుండా, మూడు నెలల జీతాలు చెల్లించకుండా, చట్ట విరుద్ధంగా తొలగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్టర్ల దోపిడిని అరికట్టడానికి, కార్మికులకు నేరుగా జీతాలు చెల్లించేందుకు ఏర్పాటు చేసిన ఆప్కాస్‌లో వీరిని ఎందుకు చేర్చలేదు. కారణమేమంటే 2019లో వీరందరినీ ఆప్కాస్‌లో చేరుస్తామని హాస్పిటల్ క్లర్క్ ఒకాయన వీరందరి దగ్గర డబ్బులు వసూలు చేశారు. అవినీతి ఆరోపణలతో క్లర్కుపై చర్యలు తీసుకొని సస్పెండ్ చేశారు. తరువాత ఏఐటియుసి కాంట్రాక్ట్ మెడికల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఔట్ సోర్సింగ్ కార్మికులను కార్పొరేషన్‌లో కలపాలని, 12 రోజులు నిరసనలు, ఆందోళనలు చేసిన తరువాత సూపరింటెండెంట్ ఎడి రమేష్ బాబు 140 మందిని కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి కార్పొరేషన్‌లో కలపాల్సిన ఉద్యోగుల లిస్టు పంపారు. ఆప్కాస్ వారు ఇచ్చిన లిస్టును సరైన వివరాల్లో మ్యాపింగ్ చేసి పంపమని తిరిగి కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు అయితే హాస్పటల్లో సూపరింటెండెంట్ గాని, ఎడి రమేష్ బాబు గానీ ఏమాత్రం పట్టించుకోలేదు. ఎన్నోసార్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ హాస్పిటల్‌కు వచ్చినా, నోటీసులు ఇచ్చిన పట్టించుకోలేదు. కారణం టెర్మినేషన్ ఆర్డర్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అందజేశారు.

ఎందుకు టెర్మినేట్ చేశారని కార్మిక సంఘాలు, విలేకరులు అడిగితే హాస్పటల్ సూపరింటెండెంట్ తనకి ఏమి తెలియదని, ఎడి రమేష్‌బాబు చేసినట్లు వివరించారు .ఎడిని అడిగితే టెర్మినేషన్ ఉత్తరంలో సూపరింటెండెంట్ సంతకం ఉంది కానీ నా సంతకం లేదని తప్పించుకునేందుకు ప్రయత్నం చేశారు. కార్మికులను తొలగించే ఫైలుకు సంబంధించిన క్లర్కు సంతకం గాని ఎడి సంతకం కానీ ఎందుకు లేదు. దీని అర్థం ఏమిటి? ఉద్దేశపూర్వకంగానే కక్ష సాధింపుగా, ఉద్యోగులను తొలగించారా? తొలగించడం వలన హాస్పిటల్ అధికారులకు ఉపయోగమేమి? కర్నూల్ ప్రభుత్వ హాస్పటల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యాపారం జోరుగానే సాగుతుంది.

స్వీపర్ పోస్టు, సెక్యూరిటీ పోస్టు, ఏఎన్ఎం, స్టాఫ్ నర్స్ పోస్టులకు కాంట్రాక్ట్ ఉద్యోగాలను లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నట్లు పత్రికలలో, టీవీలలో కూడా వచ్చింది. కానీ ఏ అధికారి పైన గాని, ఏజెన్సీ కాంట్రాక్టర్ల పైన గాని, ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకోలేదు. తొలగించిన రోజు నుండి ఎఐటియుసి ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ ఉద్యోగాలు తమకు ఇవ్వాలని ఆందోళన బాట పట్టారు. నిరసనలు, ధర్నాలు, గొంతుకు ఉరితాళ్లు బిగించుకొని గత 120 రోజులుగా కర్నూలు ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణంలోనే టెంట్ వేసుకొని రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ ఉద్యమానికి సంఘీభావంగా అనేక ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు సంఘీభావం తెలిపారు. స్థానిక కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, డాక్టర్ సంజీవ్ కుమార్‌తో వీరికి న్యాయం చేయమని కలెక్టర్‌ని కోరారు. ప్రతిస్పందనలోను కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన సందర్భంగా కర్నూలు జిల్లా కలెక్టర్ ముగ్గురు జిల్లా ఆఫీసర్లతో కమిటీ వేశారు. కమిటీలో డిఆర్ఓ కర్నూల్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ జిల్లా వైద్య అధికారులును నియమించారు. హాస్పిటల్ అధికారులను, తొలగించిన ఔట్ సోర్సింగ్ కార్మికులను, ఎఐటియుసి నాయకులను విచారించారు. ఆ విచారణలో హాస్పిటల్ అధికారులు నిధులు లేనందున జీతాలు ఇవ్వలేక తీసివేశామని, మీరు తిరిగి తీసుకోమంటే తీసుకుంటామని చెప్పారు. వీరిని తీసేయమని ఎవరు చెప్పారు, ఏ జీవో ప్రకారం తీసివేశారని అడిగితే, అపసవ్య సమాధానాలను హాస్పిటల్ అధికారులు చెప్తున్నారు. డబ్బులు లేకుంటే అనేక సంవత్సరాల నుండి పనిచేస్తున్న వారిని ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన పోస్టులలో తీసుకునేందుకు ఎందుకు ప్రయత్నించలేదు. త్రిసభ్య కమిటీ అధికారులను ప్రశ్నిస్తే దాటవేసే సమాధానం చెప్పారు. తమకు న్యాయం చేయాలని గౌరవ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టుసత్యనారాయణ, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని, బొత్స సత్యనారాయణలను కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. అయినా ఇప్పటికీ వీరి సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియషన్ పనులను, సెక్యూరిటీ గార్డులకు ఆ విధులకు పురమాయిస్తున్నారు. ల్యాబ్‌లోకి కొత్తగా వచ్చిన వారిని పరీక్షలు చేయలేక, పేద రోగులకు రక్త పరీక్షలు, ఇతర పరీక్షలకు బయటకు రాస్తున్నారు. ఖాళీగా ఉన్న రేడియోగ్రాఫర్ పోస్టులు ఉన్నాయి. కొత్తగా జరిగిన నియమాకాల్లో స్టాఫ్‌నర్స్ పోస్టు భర్తీ కాలేదు.

ఏఎన్ఎంలు చాలామంది ఉద్యోగాలకు రాలేదు. డేటా ఎంట్రీ ఆపరేటర్ లేక చాలా డిపార్టుమెంట్లో వివరాలు పంపలేకపోతున్నామని హాస్పటల్లో హెచ్ఓడీలు మాకు ఉద్యోగులను పంపమని అడుగుతున్నారు. అలాంటప్పుడు ఉద్యోగాల్లో వీరిని ఎందుకు నియమించడం లేదు. కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శాఖలో ఖాళీలు ప్రజల అవసరార్థం ఎప్పటికప్పుడు భర్తీ చేసుకోవచ్చు అని జీవో నెంబర్ ఎంఎస్ 188 స్థానిక జిల్లా కలెక్టరుకు అధికారం ఇచ్చింది. మరి ఎందుకు కలెక్టర్ వీరికి ఉద్యోగాలు ఇచ్చేందుకు సమయం కావాలి అంటున్నారు. దాదాపు 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వీరిని ఉన్న పళంగా తొలగించారు. చేశారు. నాలుగు నెలలుగా అనేక కష్టాలను ఎదుర్కొంటూ ఆందోళనలు చేస్తున్నప్పటికి ఏ అధికారి వీరి సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదు. తక్షణమే తొలగించిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు కర్నూలు జిల్లా కలెక్టర్ కృషి చేయాలని, లేనియెడల వీరి న్యాయమైన సమస్య పరిష్కారం కొరకు కార్మికులు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కార్మిక సంఘాల మద్దతుతో ఆందోళన తీవ్రతరం చేయనున్నారు.

వ్యాసరచయిత రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ వర్కర్స్ ఎంప్లాయుస్ యూనియన్

# మాటల యుద్ధం ఆపండి

- కర్ణాటక కాంగ్రెస్ వర్గపోరుపై రాహుల్ ఆగ్రహం
- కలిసి పనిచేయాలని హితవు

**బెంగళూరు:** మరో ఏడాదిలో కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, ప్రతిపక్ష కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరాయి. మాజీ సీఎం, ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య, కీలక నేత, కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ వర్గాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తమ నాయకుడే సీఎం అభ్యర్థి అని చెప్పే ప్రయత్నంలో ఇంటి పోరును రచ్చకీడుస్తున్నారు. ఈ స్థితిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నష్ట నివారణకు పూనుకున్నారు. వర్గపోరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక పర్యటనలో ఉన్న రాహుల్, కాంగ్రెస్ సీనియర్లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కర్ణాటక నుంచి బీజేపీని గద్దె దించడమే ధ్యేయంగా పని చేయాలంటూ సీనియర్లకు హితబోధ చేశారు. అంతేకాక పార్టీ అంతర్గత వ్యవహారాలను, నాయకత్వ అంశాలను ప్రజావేదికల్లో చర్చించకూడదని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో హెచ్చరించారు. కాగా, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై పార్టీలో నేతల మధ్య పోటీ నెలకొంది. 'కాంగ్రెస్ మొత్తం కలిసి కట్టుగా 2023 ఎన్నికల కోసం పోరాడాలి. తెలిసో, తెలియకో కొందరు కొన్ని ప్రకటనలు చేస్తున్నారు. దయచేసి ఎలాంటి ఉచ్చులో పడకండి. ఇంటా-బయట పార్టీ వ్యవహారాల గురించి భిన్న గొంతుకలు వినిపించకండి' అని రాహుల్ పార్టీ నేతలను కోరారు.

**అలాంటిదేం లేదన్న వేణుగోపాల్**

పార్టీలో సీఎం కుర్చీ కోసం కొట్లాట జరగడం లేదని, ఇదంతా మీడియా చేస్తున్న హడావిడే అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తోసిపుచ్చారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ సీనియర్ నేత, కర్ణాటక మాజీ సీఎం వీరప్ప మొయిలీ... కాంగ్రెస్ నేత ఎస్ఆర్ పాటిల్ సీఎం పదవికి సరైన అభ్యర్థి అని ప్రకటించడం ఆసక్తికర చర్చకు దారి తీసింది. తర్వాత మొయిలీ... పాటిల్‌కు అర్హతలు ఉన్నాయని మాత్రమే తాను అన్నానని, మీడియా దానికి వేరే అర్థం తీసిందని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

**రాహుల్ ప్రధాని అవుతారన్న మఠాధిపతి**

కర్ణాటక పర్యటనలో భాగంగా కర్ణాటకలోని చిత్ర దుర్గలో ఉన్న శ్రీ మురుగరాజేంద్ర మఠాన్ని బుధవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సందర్శించారు. లింగా యత్ వర్గానికి చెందిన ఆ మఠంలో రాహుల్‌కు ఘన స్వాగతం లభించింది. ఈ మఠానికి వచ్చిన వారికి దీవెనలు అందు తాయని, రాహుల్ గాంధీ భవిష్యత్తులో ప్రధాని అవుతారని మఠ పెద్ద డాక్టర్ శ్రీ శివమూర్తి మురుగ శరణ తెలిపారు. శివమూర్తి నుంచి రాహుల్ లింగదీక్ష తీసుకున్నారు. ఆ తర్వాత రాహుల్ మాట్లాడుతూ... కొంత కాలం నుంచి బసవన్న గురించి చదువుతున్నానని చెప్పారు. ఈ మఠానికి రావడం గర్వంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఇష్టలింగ, శివయోగ గురించి వివరంగా నేర్పేవాళ్లు కావాలని కాంగ్రెస్ నేత అన్నారు. దాని నుంచి బహుశా తాను లాభ పడే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. కర్ణాటక జనాభాలో 17 శాతం మంది లింగాయత్‌లే ఉన్నారు. కర్ణాటకలో వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార బీజేపీ, లింగాయత్‌లను తమ కీలక ఓటు బ్యాంక్‌గా పరిగణిస్తోంది.

## తిరంగా ర్యాలీలో ఉత్సాహంగా ఎంపీలు

**న్యూఢిల్లీ:** చారిత్రక రెడ్ ఫోర్ట్ నుంచి అన్ని పార్టీలకు చెందిన ఎంపీలు బుధవారం "తిరంగా బైక్ ర్యాలీ" లో పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన తిరంగా బైక్ ర్యాలీ పార్లమెంటు సమీపంలోని విజయ్ చౌక్‌కు చేరుకోవడంతో ముగిసింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుల స్మృత్యర్థం నిర్వహించిన ఈ ర్యాలీలో పలువురు ఎంపీలు, కేంద్ర మంత్రులు, యువ పార్లమెంటేరియన్లు పాల్గొన్నారు. పౌరుల్లో దేశభక్తి భావనలను మరింత ఉత్తేజపరిచేందుకు ఈ ఈవెంట్ నిర్వహించారు. ర్యాలీ మార్గంలో త్రివర్ణపతాకాలు రెపరెపలాడగా, ఎంపీలు తమ బైక్‌లకు త్రివర్ణ పతాకాలను తగిలించుకుని ఉత్సాహంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ఆగస్టు 13 నుంచి 15 వరకూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద త్రివర్ణ పతాకాలను ఎగురవేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. పార్టీ సభ్యులు బూత్ స్థాయిల్లో ఆగస్టు 11 నుంచి 13వ తేదీ వరకూ "రఘుపతి రాఘవ రాజారాం" దేశభక్తి గీతాన్ని ఆలపిస్తూ "ప్రభాత్ ఫెరి" నిర్వహించాలని సూచించారు.

## ఆర్థికమంత్రికి కష్టాలు కానరావు

### ధరల పెంపుపై సీతారామన్ జవాబుకు ఆప్ చురక

**న్యూఢిల్లీ:** ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు కష్టనష్టాలు కనిపించవు.. ధరలు పెరిగినట్లు తెలియదు.. అంతా బాగున్నట్లు మాట్లాడతారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎద్దేవా చేసింది. అధిక ధరల అంశంపై తన సమాధానం ద్వారా ఏమి రుజువు చేయాలనుకున్నారో ఆర్థికమంత్రికి బాగా తెలుసుగానీ ద్రవ్యోల్బణం వల్ల సామాన్యులు అల్లాడిపోతున్నారని పేర్కొంది. బీజేపీ చెప్పే మంచి రోజులు ఆ పార్టీ నేతలు, మంత్రులకు తప్ప సామాన్యులకు రాలేదని, తమ జీవితంలో మంచి రోజుల కోసం 'ఆమ్‌ఆద్మీ' వేచివున్నాడని ఆప్ అధికార ప్రతినిధి, ఎంపీ సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పార్లమెంటులో ధరల పెంపుదలపై సీతారామన్ స్పందనను దుయ్యబట్టారు. ఆహార ధరలు పెరిగాయని, రూపాయి మారకవిలువ పడిపోయిందని ఆమె ఒప్పుకోరు. ఆమె చాలా గొప్పవారు. ఉల్లి ధరలు పెరిగినప్పుడు నేను ఉల్లి తిననన్నారు. పాల ధర ఎలా పెరిగిందని ప్రశ్నిస్తే పాలు తాగను అన్న సమాధానం ఆమె నుంచి వస్తుంది. గోధుమలు, పప్పు, బియ్యం ధర పెంపుపై ప్రశ్నిస్తే క్యారెట్లు, ముల్లంగి తిని బతుకుతున్నానని ఆమె చెప్పినా చెబుతారు' అని సింగ్ ఎద్దేవా చేశారు.

## ఆల్వాకు జేఎంఎం, ఆప్ మద్దతు

**రాంచీ:** ఎన్డీఏకి జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) షాకిచ్చింది. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిని మార్గరెట్ ఆల్వాకు మద్దతు ఇస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ఆగస్టు 6న జరగనున్న ఎన్నికల్లో కేంద్ర మాజీ మంత్రి అల్వాకు అనుకూలంగా ఓటు వేయాలని పార్టీ అగ్రనేత శిబు సోరెన్ ఒక ప్రకటనలో తమ పార్టీ పార్లమెంటేరియన్లను కోరారు. రాజ్యసభలో ఇద్దరు, లోక్‌సభలో ఒక్కరు చొప్పున జేఎంఎంకు మొత్తం ముగ్గురు ఎంపీలు ఉన్నారు. ప్రతిపక్ష పార్టీ అయినప్పటికీ జులై 18న జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో జేఎంఎం నేతృత్వంలోని ఎన్డీఏ అభ్యర్థి ద్రౌపది ముర్ముకి మద్దతు ఇచ్చింది. కాగా అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ కూడా మార్గరెట్ ఆల్వాకు మద్దతు పలికింది. ఈ మేరకు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆగస్టు 6వ తేదీన జరిగే ఎన్నికల్లో పార్టీ ఎంపీలందరూ ప్రతిపక్షాలు బలపర్చిన అభ్యర్థి మార్గరెట్ అల్వాకు ఓటు వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆప్ అధికార ప్రతినిధి సంజయ్‌సింగ్ వెల్లడించారు. ఓట్లు వేసే లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరికీ కాంగ్రెస్ నాయకురాలు మార్గరెట్ అల్వా సోమవారం లేఖ రాశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికను పార్లమెంటు నడుస్తున్న తీరుపై రెఫరెండంగా చూడాలని అన్నారు. ముఖ్య జాతీయ సమస్యలపై ఏకాభిప్రాయాన్ని నిర్మించే ప్రాథమిక ప్రజాస్వామ్య ప్రక్రియలో విచ్ఛిన్నం అయిందన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఎన్డీఏ తన అభ్యర్థిగా మాజీ గవర్నర్ జగదీప్ ధన్‌ఖర్‌ను పోటీకి దింపింది.

# కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

### ఎన్నికల వేళ బీజేపీ గూటికి ఇద్దరు నేతలు?

**గాంధీనగర్:** ఈ ఏడాది ద్వితీయార్థంలో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ నాయకత్వంతో అసంతృప్తితో ఉన్న ఇద్దరు కాంగ్రెస్ సీనియర్ నేతలు పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి పనులు తమకెంతో నచ్చాయని, వచ్చేనెలలో బీజేపీలో చేరతామని తెలిపారు. మెహసనా జిల్లా విజపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన మాజీ హోంమంత్రి నరేశ్ రావల్ తన రాజీనామా నిర్ణయాన్ని తెలియజేస్తూ, పార్టీతో అనేక విషయాల్లో తనకు అభిప్రాయభేదాలున్నాయని, అయితే ఆ అంశాలు ఇప్పుడు ప్రస్తావించాలనుకోవడం లేదని చెప్పారు. పార్టీకి గుడ్‌బై చెప్పాలనుకుంటున్నట్టు తెలిపారు. త్వరలోనే బీజేపీలో చేరతానని, ఆ పార్టీ నాయకత్వం ఏ పని అప్పగించినా చేయడానికి సిద్ధమేనని చెప్పారు. కాంగ్రెస్ మరోనేత, రాజ్యసభ మాజీ ఎంపీ రాజు పర్మర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో తనకు 35 ఏళ్లుగా అనుబంధం ఉందని, పార్టీపై ఎలాంటి ఫిర్యాదులు చేయదలచుకోలేదని అన్నారు. అయితే, పార్టీ నాయకత్వం కొత్త వారికి ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టిందని, ఎలాంటి పదవులు ఆశించనప్పటికీ పార్టీకి సేవలందించే అవకాశం తనకు ఇవ్వకపోవడం దురదృష్టకరమని అన్నారు. మరింత మంది సీనియర్ నేతలు త్వరలో పార్టీని వీడనున్నట్టు ఆయన చెప్పారు.

**పార్టీ చాలనే అవకాశాలిచ్చింది**

నరేశ్ రావల్, రాజు పర్మర్ రాజీనామా ప్రకటనపై కాంగ్రెస్ సీనియర్ నేత అర్జున్ మొద్వాడియా మాట్లాడుతూ ఇద్దరు నేతలకు పార్టీ చాలా అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. నరేశ్ రావల్‌కు రాష్ట్ర హోంమంత్రి పదవి ఇచ్చిందని, కొద్దికాలం అసెంబ్లీలో విపక్ష నేతగా పనిచేశారని అన్నారు. ఐదుసార్లు అసెంబ్లీ అభ్యర్థిగా నిలబెట్టగా మూడుసార్లు ఆయన గెలిచారని అన్నారు. రాజు పర్మర్‌ను సైతం పార్టీ మూడుసార్లు రాజ్యసభకు పంపిందని, షెడ్యూల్డ్ కులాల కమిషన్‌కు చైర్మన్‌ను చేసిందని అన్నారు. వారికేమైనా ఇబ్బందులు ఉంటే పార్టీతో మాట్లాడి పరిష్కరించుకోవాలని, ఇలా చేయడం వల్ల పార్టీ ప్రతిష్ఠపై ప్రభావం చూపడంతో పాటు పార్టీ వ్యతిరేక ఆలోచనకు తావిస్తుందని అన్నారు.

## కుల్‌దీప్ బిష్ణోయ్ రాజీనామా

**చండీగఢ్:** కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే కుల్‌దీప్ బిష్ణోయ్ హర్యానా అసెంబ్లీకి బుధవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని అసెంబ్లీ స్పీకర్ జ్ఞాన్‌చంద్ గుప్తాకు అందజేశారు. గురువారం ఆయన బీజేపీలో చేరనున్నారు. దీంతో ప్రస్తుతం ఆయన ప్రాతిని ధ్యం వహిస్తున్న హిసార్ జిల్లా ఆదంపూర్ నియోజక వర్గంలో ఉపఎన్నిక అనివార్యం కానుంది. రాజ్యసభ ఉపఎన్నికల్లో బిష్ణోయ్ క్రాస్ ఓటింగ్ చేయడంతో ఆయనను పార్టీలోని అన్ని పదవుల నుంచి కాంగ్రెస్ తొలగించింది. అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా అనం తరం బిష్ణోయ్ మాట్లాడుతూ తనను రాజీనామా చేయా లని బీఎస్ హుడా సవాలు చేశారని, దానిని తాను స్వీకరిం చానని చెప్పారు. ఇప్పుడు తాను ఆయనకు (హుడా) సవాల్ చేస్తున్నానని, ఆదంపూర్ నియోజకవర్గం నుంచి తనపై పోటీచేసి గెలవాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పునర్వ్యవస్థీ కరణలో భాగంగా హర్యానా శాఖ అధ్యక్ష పదవిని ఈ ఏడాది బిష్ణోయ్ ఆశించారు. అందుకు అధి ష్ఠానం విముఖత చూపడంతో ఆయన తిరుగుబాటు బావుటా ఎగురవేశారు.

### కొత్త సీజేఐ, జడ్జీల నియామకంపై

# సుప్రీం కొలీజియం భేటీ

- గంటకుపైగా చర్చలు
- కుదరని ఏకాభిప్రాయం

**న్యూఢిల్లీ:** ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు కొలీజియం భేటీ అయింది. తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తి నియామక ప్రక్రియను ప్రారంభించడంపై చర్చించింది. కొలీజియానికి సారథ్యం వహించే సీజేఐ ఎన్వీ రమణ పదవీకాలం ఈనెల 26తో ముగియనుంది. దీంతో కొత్త సీజేఐతో పాటు సుప్రీంకోర్టులో ఖాళీగా ఉన్న మూడు న్యాయ మూర్తుల స్థానాల భర్తీపై కొలీజి యం చర్చించింది. అయితే ఏకాభి ప్రాయం కుదరలేదని సమాచారం. ఖాళీల భర్తీ /నియామకం/ హైకోర్టు జడ్జీల బదిలీపై గంటా15నిమిషాలు పాటు చర్చలు సాగాయి. భేటీ ఇంత సేపు జరగడం అరుదని వార్తా నివేదికలు పేర్కొన్నాయి. మామూలుగా ఉదయం 10.30 గంటలకు సుప్రీంకోర్టు కార్యకలా పాలు మొదలవుతాయి. కానీ ఈ సమావేశం క్రమంలో న్యాయ మూర్తులు ఉదయం 11.15 గంటలకు కోర్టుకు చేరుకున్నారు. దీంతో చర్చలపై న్యాయవాదుల్లో ఊహాగానాలు పెరుగుతున్నాయి. తదుపరి సీజేఐగా జస్టిస్ యూయూ లలిత్ పేరు పరిగణనలో ఉన్నట్లు తెలుస్తోంది.

## రాహుల్ డీపీ మార్చారు...కానీ!

**న్యూఢిల్లీ:** స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తోన్న తరుణంలో ప్రధాని నరేంద్రమోదీ తన సామాజిక మాధ్యమ ఖాతాల ప్రొఫైల్ చిత్రంగా జాతీయ జెండాను ఉంచారు. హర్ ఘర్ తిరంగా ఉత్సవంలో భాగంగా తాను డీపీని మార్చానని, ప్రతి ఒక్కరూ మార్చాలంటూ దేశ ప్రజలను కోరారు. ఈ నేప థ్యంలో బుధవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా సామాజిక మాధ్యమ డీపీని మార్చారు. ఒకవైపు దేశభక్తి చాటుతూనే మరోవైపు తన రాజకీయ ప్రత్యర్థికి చురక అంటించారు. దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ జెండాను చేతబట్టిన చిత్రాన్ని డీపీగా ఉంచారు. 'ఈ త్రివర్ణ పతాకం దేశానికే గర్వకారణం. ఇది ప్రతి భారతీయుడి గుండెల్లో ఉంది' అంటూ ట్వీట్ చేశారు. రాహుల్ సోదరి ప్రియాంక గాంధీ, అనేక మంది కాంగ్రెస్‌నేతలు కూడా ఇదే చిత్రాన్ని ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ నాయ కుడు మనోజ్ తివారీ కాంగ్రెస్ నేతలపై విమర్శలు గుప్పించారు. త్రివర్ణ పతాకంలో కూడా విపక్షాలు బీజేపీని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. నెహ్రూ జీ త్రివర్ణ పతాకాన్ని పట్టుకుంటే... ఇప్పుడు రాహుల్ గాంధీ పట్టుకున్నారనీ రాశారని అన్నారు. రాహుల్ గాంధీకి హీరో అయ్యే అవకాశం వచ్చినప్పటికీ దానిని ఆయన వినియోగించుకోలేకపోయారని అన్నారు.

## 'మాలెగావ్' కేసులో బీజేపీ ఎంపీ ప్రగ్యా హస్తం

### ఫోరెన్సిక్ నిపుణుల వెల్లడి

**ముంబై:** మాలేగావ్‌లో 2008లో జరిగిన పేలుళ్లలో బీజేపీ ఎంపీ ప్రగ్యాసింగ్ ఠాకూర్‌కు సంబంధం ఉన్నట్లు ఫోరెన్సిక్ నిపుణులు తేల్చారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను ఫోరెన్సిక్ నిపుణులు ముంబైలోని ప్రత్యేక ఎన్ఐఎ కోర్టుకు నివేదించారు. ఈ పేలుళ్ల కేసులో 261 మంది సాక్షులను ప్రత్యేక ఎన్ఐఎ కోర్టు విచారించింది. మాలే గావ్ మసీదులో జరిగిన పేలుడు స్థలంలో పేలుడు పదార్థాలు ఉంచిన ఒక ఎల్ఎంఎల్ వెస్పా స్కూటరు పోలీసులకు లభించింది. ఈ స్కూటర్ భోపాల్ బీజేపీ ఎంపీ ప్రగ్యాసింగ్ ఠాకూర్ పేరుపై రిజిస్టర్ చేసి ఉందని పేర్కొ న్నారు. నాసిక్ జిల్లా మాలేగావ్ పట్టణంలోని మసీదులో 2008 సెప్టెంబరు 29న జరిగిన స్కూటర్ బాంబు పేలుళ్లలో ఆరుగురు మరణిం చగా, మరో 100 మంది గాయపడ్డారు. పేలుడు స్థలంలో లభించిన ప్రగ్యాకు చెందిన స్కూటరులో అమ్మోనియం నైట్రేట్‌ను రికవరీ చేశామని ఫోరెన్సిక్ నిపుణులు కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. తాము జరిపిన కెమికల్ పరీక్షల్లో అమ్మోనియం నైట్రేట్‌ను పేలుడుకు ఉపయోగించారని సాక్షులు చెప్పారని తెలిపారు. పేలుడు స్థలంలో ప్రగ్యాసింగ్‌కు చెందిన ఎల్ఎంఎల్ వెస్పా స్కూటరు చెల్లా చెదురైందని, ఇంధన ట్యాంకు, సీటు కవరు, స్కూటరు పార్టులు విడిపోయాయని తెలిపారు. ఆ భాగాలను సేకరించి పరీక్షించామని, పేలుడు పదార్థాలతోనే మాలెగావ్ పేలుళ్లు జరిపారని ఫోరెన్సిక్ నిపుణుడు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవినాశ్ రసాల్ చెప్పారు. స్కూటర్ ఇంజిన్ నంబరును చెరిపి వేశారని ఓ సాక్షి వివరించారు. పేలుడు స్థలంలో లభించిన స్కూటరును కోర్టులో మరో సాక్షి గుర్తించారు. స్కూటరు బాంబుతో పేలుళ్లకు పాల్పడ్డారని ప్రాసిక్యూషన్ వెల్లడించింది.

# దేశభక్తి బీజేపీ పేటెంటా?

- డీపీగా త్రివర్ణ పతాకం పెట్టాలన్న మోదీ పిలుపుపై భిన్న స్వరాలు
- గత చరిత్రను తవ్వుతున్న నెటిజన్లు

**న్యూఢిల్లీ:** సామాజిక మాధ్యమాల ఖాతాల్లో త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఇచ్చిన పిలుపుపై దేశవ్యాప్తంగా భిన్న స్వరాలు వినిపి స్తున్నాయి. 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాల నేపథ్యంలో మోదీ ఇచ్చిన ఈ పిలుపులో తప్పు లేకపోయినా ఆయన వ్యవహార శైలిపై అవగాహన ఉన్న వివిధ వర్గాల నుంచి సామాజిక మాధ్యమాల వేదికగా విమర్శల వర్షం కురుస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మాతృ సంస్థగా పేరున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించిన మోదీ నోటి వెంట ఇటువంటి పిలుపు రావడమే ఇందుకు కార ణంగా తెలుస్తోంది. స్వాతంత్ర్య సంగ్రామంలో ఇసుమంత పాత్ర లేని ఆర్ఎస్ఎస్‌కు చెందిన నేతల నుంచి తాము దేశభక్తిని నేర్చుకోవాలా అనే ప్రశ్నతో ప్రారంభమైన విమ ర్శలు క్రమంగా వివిధ కీలక అంశాలపైకి మరలింది. మూడు రంగుల జండా దేశానికి వద్దు, ప్రతికూల ఫలితాలే వస్తాయని, మూడు రంగులతో ఉన్న ఈ జెండాను తాము అంగీకరించం...దేశాన్ని అరిష్టాలపాలు చేస్తుంది, తాము ఎన్నడూ మువ్వన్నెల జండాను ఆమోదించే సమస్యే లేదని ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు హెగ్డేవార్ 1930లో తమ అధికార పత్రిక ఆర్గనైజర్‌లో రాసిన విషయాలను వెలుగు లోకి తెస్తున్న నెటిజన్లు...దీన్ని కూడా దేశభక్తి అంటారా అంటూ ప్రధానిపై ప్రశ్నలు సంధిస్తున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న మోదీ దేశ గౌరవ పతాకాన్ని తన మెడలో వేసుకుని అనుచిత రీతిలో ఉపయోగిస్తున్నట్టు కనిపిస్తున్న ఫొటోలను విస్తృతంగా షేర్ చేస్తూ ఇది కూడా దేశ భక్తి, జెండా భక్తి కిందకే వస్తుందంటారా అని నిలదీస్తున్నారు. పైగా దేశానికి స్వాతంత్ర్యం వద్దని ఆ సంగ్రామానికి వెన్నుపోటు పొడిచిన చరిత్ర ఉన్న ఆర్ఎస్ఎస్ నేతలు రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు తరుణంలో, లౌకికవాదంపై వివిధ సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో పోస్టుల రూపంలో పెడుతున్నారు. 1947లో స్వాతంత్ర్యం వస్తే ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాల యంలో 2002 దాకా మువ్వన్నెల జెండాను ఎందుకు ఆవిష్కరించలేదని సూటిగా నిలదీస్తున్నారు. ప్రధానిగా మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో తన వ్యక్తిగత చిత్రాన్ని తొలగించి మువ్వన్నెల జెండాను ప్రదర్శించడాన్ని స్వాగతి స్తూనే ఆర్ఎస్ఎస్ అధికారిక పేజీల్లో మాత్రం మువ్వన్నెల జెండాను పెట్టకపోవడం వెనుక కారణాలు చెప్పాలని డిమాండు చేస్తున్నారు. మోదీ పాలనపై విమర్శలు ఎక్కువవు తున్న ప్రతిసందర్భంలోనూ ప్రజల దృష్టి మళ్లించేలా కొన్ని ఎత్తుగడలకు దిగుతారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కరోనా సమయంలో తమ లోపాలను ప్రజలు గ్రహించ కుండా దీపాలు వెలిగించడం, తాళాలు మోగించడం వంటి టాస్కులు ఇచ్చి ప్రజల దృష్టి మరల్చిన విషయాలను గుర్తు చేస్తున్నారు. తాజాగా దేశంలో మతతత్వ పోకడలు పెరగడం, కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిం చడం, నల్ల చట్టాల తయారీ తదితర అనేక సమస్యలు ముందుకొస్తున్న తరుణంలో దేశభక్తి పేరును ముందుకు తెచ్చి అసలు సమస్యలను పక్కదారి పట్టించే ఆలోచనే ప్రధాని పిలుపునకు కారణమనే అనుమానాల్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజలపై అధిక ధరల భారం పడుతోందని, జీఎస్టీ పేరుతో మరింత ఇబ్బందుల పాలు చేస్తున్న ప్రభుత్వ దుర్నీతిని కప్పిపుచ్చుకోవడం కోసం మూడు రంగుల జెండాను సైతం ఈ ప్రభుత్వం అడ్డుపెట్టుకుంటోం దనే వ్యాఖ్యలు మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రభుత్వం మోపిన ధరల భారం ప్రభావం చిన్న పిల్లలకు కూడా అర్థమవుతోందని, ఇందుకు రెండు రోజుల కిందట ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒకటో తరగతి చదివే ఒక చిన్నారి తాము వినియోగించే పెన్సిళ్ల ఖరీదు పెరగడానికి మీ ఆర్థిక విధానాలే కారణమంటూ ప్రధాని మోదీకి సూటిగా లేఖ రాయడమే నిదర్శనమని మరి కొందరు పోస్టులు పెడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో డీపీలను మార్చితేనే దేశభక్తి ఉన్నట్టు కాదని, సమస్యల చిట్టాతో ప్రభుత్వం తీరును విమర్శిస్తూ మరి కొందరు పోస్టులు పెడుతుండడం గమనార్హం. దేశభక్తి అనేది ఒకరు ఇచ్చే టానిక్ కాదు... అయినా దేశద్రోహానికి పాల్పడిన వ్యవస్థలతో అంట కాగుతున్న వారి నుంచి తామేమీ నేర్చుకోవాల్సిన అవసరం లేదంటూ మరి కొందరు ఘాటు వ్యాఖ్యలతో పోస్టింగులు పెడుతున్నారు. 1948లో ఆర్ఎస్ఎస్‌ను ప్రభుత్వం నిషేధిత సంస్థగా ప్రకటించిన నేపథ్యంలో నాటి సర్వ సంచాలక్ గోల్వాల్కర్ భారత ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను కలసి ఇకపై మువ్వన్నెల జెండాను గౌరవిస్తామని, రాజ్యాం గాన్ని గుర్తిస్తామని, తమ కార్యాలయంపై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తామని హామీ ఇచ్చి నిషేధం ఎత్తి వేయించుకుని అనంతరం మాటతప్పి ప్రభుత్వాన్నే వెన్నుపోటు పొడిచిన చరిత్ర ఆర్ఎస్ఎస్‌ది అంటూ అనేక చారిత్రక విషయాలను వెలుగులోకి తెస్తున్నారు. పటేల్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం 1950 జనవరి 26న నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో ఆవిష్కరించి పటేల్ మరణానంతరం 2002 దాకా జెండాను ఎగురవేయకుండా తమ అసలు స్వరూపాన్ని ప్రదర్శించడం నిజం కాదా అని నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. దేశభక్తి అనేది బీజేపీ పేటెంటు కాదని, గురివింద సామెతను గుర్తు చేస్తూ పూర్వవృత్తాంతాల్ని మరచి ప్రజలకు దేశభక్తిపై ఉపన్యాసాలు ఇస్తే సరిపోదని గురజాడ అప్పారావు కవిత్వంలోని వట్టి మాటలు కట్టి పెట్టి గట్టిమేలు తలపెట్టు అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

## ఉపాధి పథకం ప్రాథమిక సూత్రాలకు విరుద్ధం

### మోదీ సర్కారుపై కేరళ ఆగ్రహం

**తిరువనంతపురం:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కేరళ వామపక్ష ప్రభుత్వం కోరింది. కోవిడ్-19 వల్ల ఏర్పడిన సంక్షోభం నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఏకకాల పనులను పరిమితం చేయాలన్న నిర్ణయం పెద్ద ఎదురుదెబ్బగా మారనుందని పేర్కొంది. కేరళలో ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండానే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎంవీ గోవిందన్ తెలిపారు. ఇది కూలీలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టడమే కాకుండా దక్షిణాది రాష్ట్రంలో పథకం అమలుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సరికొత్త నిర్ణయంపై తమ ఆందోళనలను తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు లేఖ పంపినట్లు చెప్పారు. కోవిడ్ వల్ల ఏర్పడిన సంక్షోభం నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న స్థానిక ఆర్థిక రంగానికి భారీ ఎదురుదెబ్బ కానుందని, కార్మికులను సంక్షోభంలోకి నెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మంత్రి ప్రకటనలో కోరారు. ఏక కాలంలో 20 పనులకు మాత్రమే అనుమతినివ్వాలని ఆదేశించడం వల్ల కార్మికరంగంలోనూ.. స్థానిక ఆర్థిక రంగంలోనూ సమస్యలు ఉత్పన్నమవుతాయని అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం 100 రోజుల పాటు పనిదినాలు కల్పించాలన్న ఉపాధి హామీ పథకం ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమన్నారు. కేరళ, ఉత్తరాది రాష్ట్రాల్లోని గ్రామ పంచాయతీల నిర్మాణం చాలా భిన్నంగా ఉంటుందని ఎత్తి చూపిన ఆయన.. కేరళలోని ఒక వార్డు కూడా ఇతర రాష్ట్రాల్లోని పంచాయతీ జనాభాను కలిగి ఉండవచ్చునని అన్నారు. కేరళలోని గ్రామ పంచాయతీలు 13 నుంచి 23 వార్డులు కలిగి ఉన్నాయని, రాష్ట్రంలో ఏకకాల పనులు అమలు చేయడం ద్వారా అపారమైన కార్మికుల డిమాండ్‌ను తగ్గిస్తుందని గోవిందన్ అన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది 10 కోట్ల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేసినా కేంద్ర ప్రభుత్వం కేవలం 6కోట్ల రోజులు మాత్రమే కేటాయించిందని తెలిపారు. ఆర్థిక సంవత్సరం నుంచి మొదటి నాలుగు నెలల్లో రాష్ట్రం ఇప్పటికే 2.43 కోట్ల పని దినాలను పూర్తి చేసిందని చెప్పారు.

## 6న జేఈఈ మెయిన్ రెండో విడత ఫలితాలు

**న్యూఢిల్లీ:** జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ రెండవ విడత ఫలితాలను ఈ శనివారం (ఆగస్టు 6న) ప్రకటించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం తెలిపింది. జులైలో నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్ష ఫలితాలను ఆగస్టు 6న ప్రకటిస్తామని, జవాబుకు సంబంధించిన కీని చేయనున్నట్లు పేర్కొంది. అభ్యర్థులు ఆగస్టు 5 వరకు ఆన్సర్ కీపై అభ్యంతరాలు లేవనెత్తేందుకు అవకాశం ఉందని, ఆ తర్వాత తుది ఆన్సర్ కీ, స్కోర్ కార్డ్, మెరిట్ జాబితాను విడుదల చేస్తామని ఎన్‌టీఏ పేర్కొంది. జేఈఈ మెయిన్ 2022 ఫలితాలు, ఆన్సర్ కీ కోసం యవవఘుఆఅ.త్ఖు.అఆఎ.ఆఅ లో చూడవచ్చునని తెలిపింది.

# బీసీల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్

## డిమాండ్ చేస్తూ పార్లమెంట్ వద్ద బీసీ నాయకుల మహాధర్నా

విశాలాంధ్ర-హైదరాబాద్: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి ఏటా బీసీల అభివృద్ధికి రూ.రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, త్వరలో కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనగణనలో కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ వందలాదిమంది బీసీ నాయకులు బుధవారం దిల్లీలోని పార్లమెంటు వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బీసీ సంఘాల అధ్వర్యంలో జరిగిన ఈ మహాధర్నాకు రెండు రాష్ట్రాల నుంచి వందలాదిమంది నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ ధర్నా కార్యక్రమానికి మద్దతుగా వివిధ పార్టీల ఎంపీలు ఆర్.కృష్ణయ్య (రాజ్యసభ), భరత్ (రాజమండ్రి) సత్యవతి (అనకాపల్లి) టీ.గురుమూర్తి (తిరుపతి), మాధవ్ (హిందూపూర్), గల్లా జయదేవ్ (గుంటూరు), రామ్ మోహన్ నాయుడు (శ్రీకాకుళం), రవీంద్ర కుమార్ (రాజ్యసభ), సంతోష్ (కేరళ సీపీఐ), బడుగు లింగయ్య (రాజ్యసభ) తదితరులు హాజరై ప్రసంగించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లాకా వెంగళరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జబ్బల శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు యాదవ్, మహిళా సంఘం అధ్యక్షురాలు ఎనగాల నూకాలమ్మ, తెలంగాణకు చెందిన జగదీశ్ యాదవ్ తదితరులు నాయకత్వం వహించారు. ధర్నాను ఉద్దేశించి ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ... దేశంలోనే 75 కోట్ల మంది ప్రజలకు కేంద్రంలో ఒక మంత్రిత్వ శాఖ పెట్టవలసిన ఆవశ్యకత ఉందన్నారు. అన్ని సామాజిక వర్గాలకు మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. అలాగే అన్ని రాష్ట్రాలలో బీసీల మంత్రి శాఖలు ఉన్నాయి. కానీ కేంద్రంలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి స్కాలర్ షిప్ పథకం, ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకం, ప్రత్యేక నవోదయ పాఠశాలలు, కుల వృత్తులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడానికి సబ్సిడీ రుణాలు ఇవ్వాలని సూచించారు. ప్రతి బీసీ కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. బీసీ జనాభా లెక్కల వివరాలు సేకరించవలసిన ఆవశ్యకత ప్రభుత్వాలకే ఉంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులాల అభివృద్ధికి విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు-ఆర్థిక, రాజకీయ రంగాలలో అభివృద్ధికి అనేక స్కీములు అమలు జరుపుతున్నారు. బడ్జెట్టు కేటాయిస్తున్నారు. అలాగే రిజర్వేషన్లను గ్రూపులుగా వర్గీకరణ చేస్తున్నారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల కేటాయింపు-పంచాయతీరాజ్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీసీ జనాభా లెక్కల వివరాలు అవసరం పడుతున్నాయి. మనదేశంలో బీసీ కులాల జనాభా లెక్కల వివరాలు లేకపోవడంతో రిజర్వేషన్ల శాతం నిర్ణయించడంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పడుతున్నాయి. జనాభా లెక్కలు లేనందున సుప్రీంకోర్టు, హైకోర్టులు రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించడాన్ని కొట్టి వేస్తున్నాయి. ఏయే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను బీసీలకు కేటాయించాలి, ఎంత శాతం కేటాయిం చాలని విషయంలో బీసీ జనాభా లెక్కలు లేక న్యాయపరమైన చట్టపరమైన కోర్టు కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే బడ్జెట్ కేటాయింపుల సందర్భంగా కూడా బీసీ జనాభా లెక్కలు లేక అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. గ్రామీణాభివృద్ధి పథకాలకు, ఇళ్ల పథకాలకు స్వయం ఉపాధి పథకాలకు బడ్జెట్ కేటాయింపులు బీసీ జనాభా లెక్కలు లేకపోవడంతో ప్రభుత్వమే ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కేంద్ర బీసీ రిజర్వేషన్లను గ్రూపులుగా వర్గీకరించడానికి జస్టిస్ రోహిణిని చైర్మన్ కమిటీ చేశారు. కుల వారి జనాభా లెక్కలు లేకపోవడంతో ఈ కమిటీ వర్గీకరణ చేసి ఏయే గ్రూపుకు ఎంత శాతం నిర్ణయించాలో తెలియక తికమక పడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటుంది. గతంలో 2010లో అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా బీజేపీ పరంగా బీసీ జనాభా కులాల వారీగా లెక్కలు తీయాలని పార్లమెంటులో డిమాండ్ చేసింది. బీజేపీ కోరినందుకే అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కులాల వారీ లెక్కలు తీయాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు బీజేపీ అధికారంలో ఉంది. కావున కులాలు వారి లెక్కలు తీయవలసిన బాధ్యత, అవసరం-ఆవశ్యకత ఉందని కృష్ణయ్య అన్నారు.

# పాలు, పెన్సిల్‌పై జీఎస్టీ సిగ్గు... సిగ్గు

- కార్పొరేట్‌లకు మోదీ దేవుడు
- బీజేపీ భావజాలాన్ని ఎండగట్టాలి
- ప్రజా సమస్యలను గాలికొదిలేసిన వైసీపీ, టీడీపీ
- అక్కడ ముద్దులాట.. ఇక్కడ గుద్దులాట

మాట్లాడుతున్న ఓబులేసు. భీమారావు, సుబ్బరాజు, విద్యాధర్, వెంకట్రావు, సీతారాంప్రసాద్ తదితరులు

విశాలాంధ్ర -భీమవరం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిపే పోరాటాల్లో కార్యకర్తలు క్రియాశీలక పాత్ర పోషించి, త్యాగాలకు సిద్ధమవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జీ ఓబులేసు పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా సీపీఐ 26వ మహాసభల సందర్భంగా చెల్లబోయిన రంగారావు, టి.అప్పలస్వామి, ఎం.వసంతకుమారి అధ్యక్షవర్గంగా బుధవారం రెండో రోజు జరిగిన ప్రతినిధులు సభలో ఆయన ముఖ్య అతిథిగా వచ్చి పార్టీ శ్రేణులకు భవిష్యత్ ఉద్యమాలపై దిశా నిర్దేశం చేశారు. మోదీ పుట్టకముందే ఇండియా అభివృద్ధి చెందిందనీ, నాడు నెహ్రూ సోవియట్ రష్యా సహకారంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపారని, ఇప్పుడు మోదీ తన హయాంలోనే అభివృద్ధి జరిగిందని చరిత్రను వక్రీకరిస్తున్నాడని దుయ్యబట్టారు. వాజ్‌పేయ్ తో సహా ప్రధానులందరూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్మిస్తే వాటిని నిస్సిగ్గుగా మోదీ అమ్మేస్తున్నాడని మండిపడ్డారు. మోదీ వాడుతున్న ప్రత్యేక విమానం రూ.8.4 కోట్లనీ, దాన్ని అమ్మితే కరోనా మృతుల కుటుంబాలకు రెండు లక్షల రూపాయిలు ఇవ్వవచ్చుననీ, 8లక్షల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించవచ్చునన్నారు. మోదీకి జీఎస్టీ కాసులు కురిపిస్తోందనీ, వజ్రాలు, బంగారం ఆభరణాలపైలేని జీఎస్టీ చిన్నారులు తాగే పాలపైన, స్కూల్ పిల్లలు వాడే పెన్సిల్‌పైనా వేస్తావా? అని ప్రశ్నించారు. కార్పొరేట్‌లన్నీ మోదీకి దాసోహమంటున్నాయనీ, ఆయన కార్పొరేట్‌లకు దేవుడు, సామాన్యుడికి యముడిలా మారాడని ఎద్దేవా చేశారు. జగన్, మోదీ తోడు దొంగలని విశాఖ ఉక్కు, పోలవరం నిధులు, కృష్ణపట్నం పోర్టు, విశాఖ ఓడరేవు, ప్రత్యేక హోదా వీటిపై జగన్ ఇక్కడ మొరుగుతాడని దిల్లీలో సాగిలపడ్డాడని విమర్శించారు. టీడీపీ మహానాడులో చేసిన 27 తీర్మానాల్లోగాని, వైసీపీ ప్లీనరీలో ఆమోదించిన తీర్మానాల్లోగాని ప్రజలెదుర్కొంటున్న సమస్యలను గాలికొదిలేశారని, ప్రజలు శ్రేయస్సుపై చర్చించలేదని బాబు, జగన్‌లు మోదీతో ముద్దులాట.. ఇక్కడ గుద్దులాట ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. విశాఖలో జరిగే రాష్ట్ర మహాసభల్లోనూ, విజయవాడలో జరిగే జాతీయ మహాసభల్లో నూతన ప్రత్యామ్నాయంపై దిశా నిర్దేశం చేస్తామని కమ్యూనిస్టు కంచుకోట విజయవాడలో 47 ఏళ్ల తరువాత జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభలు చారిత్రకంగా నిలుస్తాయని, రెడ్ షర్టు వలంటీర్లు జరిపే కవాతు ముష్కర పాలకులకు వణుకు పుట్టించాలని, జాతీయ మహాసభలు విజయవంతానికి ప్రతి ఒక్కరూ కీలకంగా కృషిచేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో బలమైన ఉద్యమాలను నిర్వహించిన ఘనత మనదేనని పార్టీ పూర్వ వైభవానికి ముందుకు రావాలన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు సమర్పించిన కార్యదర్శి నివేదికను ప్రతినిధుల సభ ఆమోదించింది. పెన్మత్స సుబ్బరాజు, వైట్ల విద్యాధర్, కలిశెట్టి వెంకట్రావు, ఎం.సీతారాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే పోరాటాలు ఉధృతం: జేవీఎస్ఎన్

విశాలాంధ్ర- విశాఖపట్నం: విశాఖలో ఆగస్టు 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ ఏపీ రాష్ట్ర 27వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్ మూర్తి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం పార్టీ శ్రేణులతో కలసి గాజువాక నియోజకవర్గం పరిధిలోని గంగవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 48 ఏళ్ల అనంతరం విశాఖలో రాష్ట్ర మహాసభలు నిర్వహిసు న్నామని, ప్రజలంతా తమకు తోచిన రీతిలో మహాసభల విజయవంతానికి ఆర్థికంగా సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. అనంతరం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు చేస్తూ, పార్టీ మహాసభలకు అడిగిన వెంటనే స్వచ్ఛందంగా తమకు తోచిన రీతిలో ప్రజలు సహకరించడం సంతోషాన్నిస్తోందన్నారు. మూడు రోజుల పాటు విశాఖ నగరం వేదికగా జరుగనున్న రాష్ట్ర మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై చర్చించి భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నేతలు వై నందన్న, పీ పోలయ్య, కే పోతయ్య, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ఆరిలోవలోనూ...**

విశాఖలోని తూర్పు నియోజవర్గం పరిధి, ఆరిలోవ ప్రాంతంలో సీపీఐ శ్రేణులు రాష్ట్ర మహాసభలకు సంబంధించిన ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల వద్ద నుంచి విరాళాలు సేకరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్ కే రెహమాన్, ఏ దేవుడమ్మ, కె లక్ష్మణరావు, ఏ రవి, సీహెచ్ కాసుబాబు, కే రమణ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శిగా తాటిపాక మధు

### సహాయ కార్యదర్శులుగా రాంబాబు, భాస్కర్ రావు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: సీపీఐ తూర్పు గోదావరి జిల్లా 25వ మహాసభలు ఆగస్టు 1, 2 తేదీల్లో జరిగాయి. ఈ సభల్లో 41 మంది సమితి సభ్యులు, 11 మంది కార్యవర్గ సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా కార్యదర్శిగా తాటిపాక మధు, సహాయ కార్యదర్శులుగా కుండ్రపు రాంబాబు, రేఖ భాస్కర్‌రావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వి. కొండలరావు, నల్ల భ్రమరాంబ, బి. రవిచంద్ర, సత్యనారాయణ, కె. జ్యోతిరాజు, సూరిబాబు, సీహెచ్ లక్ష్మణ్, సీహెచ్ సునీల్ ఉన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు రావుల వెంకయ్య నూతన కమిటీని అభినందించారు.

## కొత్త సీవీసీగా సురేశ్ పటేల్

### విజిలెన్స్ కమిషనర్లుగా కుమార్, శ్రీవాత్సవ ప్రమాణం

న్యూదిల్లీ : సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ)గా సురేశ్ ఎన్ పటేల్ నియమితులయ్యారు. కొత్త సీవీసీతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్రపతి భవన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు సీవీసీగా సురేశ్ ఎన్ పటేల్ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు హాజరయ్యారు. పటేల్ అంతకుముందు ఆంధ్రాబ్యాంకు ఎండీగా, సీఈవోగా పనిచేశారు. 2020, ఏప్రిల్‌లో విజిలెన్స్ కమిషన్‌గా నియమితులయ్యారు. మాజీ ఐఏఎస్ సంజయ్ కొఠారీ గతేడాది జూన్ 24న సీవీసీగా పదవీ విరమణ పొందిన తర్వాత నుంచి ఈ పదవి ఖాళీగానే ఉంది. పటేల్ తాత్కాలిక సీవీసీగా జూన్ నుంచి విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. పటేల్ నియామకానికి ప్రధాని మోదీ నేతృత్వ ఎంపిక కమిటీ (సెలక్షన్ కమిటీ) గతనెలలో ఆమోదం తెలిపింది. అలాగే, విజిలెన్స్ కమిషనర్లుగా ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ అరవింద్ కుమార్, మాజీ బ్యూరోక్రాట్ ప్రవీణ్ కుమార్ శ్రీవాత్సవల నియామకాన్ని ఆమోదించింది.

# చిరు వ్యాపారుల సేవలు అమోఘం

## జగనన్న తోడు పథక నిధులు

## రూ.395కోట్లు జమ చేసిన సీఎం జగన్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చిరు వ్యాపారులు తమకు తాము ఉపాధి కల్పించుకోవడమే కాకుండా, మరికొంత మందికి కొద్దోగొప్పో ఏదో రూపంలో ఉపాధినిస్తూ సమాజానికి తమ వంతు సేవలందిస్తున్నారని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కొనియాడారు. జగనన్న తోడు పథకం కింద ఆరునెలలకు సంబంధించి సకాలంలో రుణాలు చెల్లించిన వారికి రూ.15.96 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్‌తో సహా, కొత్తగా 3.95లక్షల మంది చిరు వ్యాపారులకు బుధవారం సీఎం జగన్ కంప్యూటర్‌లో బటన్ నొక్కి నిధులు వారి ఖాతాల్లో జమ చేశారు. నామమాత్రపు లాభాలనే సంతోషంగా తీసుకుంటూ... సేవలందించే గొప్ప వర్గం చిరు వ్యాపారులు. నిజానికి ఈ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలు చేసేది వ్యాపారం అనేదాని కన్నా గొప్ప సేవ అనడంలో ఏమాత్రం సంకోచం లేదని జగన్ అన్నారు. నిరుపేదలైన చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి ఒక్కొక్కరికి ఏటా రూ.10వేల చొప్పున వడ్డీ లేని రుణం క్రమం తప్పకుండా అందజేస్తున్నామన్నారు. ఇలాంటి చిరువ్యాపారులతో పాటు సంప్రదాయ చేతివృత్తుల వారు తమకు బ్యాంకుల నుంచి రుణాలు రాక, వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడి అధిక వడ్డీలు, చక్రవడ్డీలు కట్టలేక వీరు పడుతున్న బాధలు తన పాదయాత్రలో కళ్లారా చూశానని ఆనాటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. వీళ్లు వడ్డీ వ్యాపారులకు కట్టాల్సిన వడ్డీయే చాలా సందర్భాల్లో వేయి రూపాయలకు వంద రూపాయలు కట్టాల్సిన పరిస్థితి. ఉదయాన్నే రూ.1000 ఇస్తే సరుకులు తీసుకుని అవి అమ్ముకుని రూ.100 వీరికి లాభం ఇవ్వాల్సిన పరిస్థితి. దాదాపు రూ.100కు రూ.10 వడ్డీ కట్టుకోవాల్సిన పరిస్థితి. ఇటువంటి నడ్డి విరిచే ఈ వడ్డీల బారి నుంచి వీరిని తప్పించి, లక్షల కుటుంబాలకు అండగా ఉండాలని, అలా చేయగల్గితేనే వీరి జీవితాలు బాగుపడతాయని తన పాదయాత్ర సందర్భంగా తాను చెప్పిన మాటలు గుర్తున్నాయన్నారు. అందుకే చెప్పిన మాటకు కట్టుబడి జగనన్న తోడు అన్న ఈ పథకాన్ని ప్రారంభించి నిరుపేదలైన చిరువ్యాపారులు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతివృత్తుల వారిని వారి కాళ్లమీద వాళ్లని నిలబెట్టేలా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున వడ్డీలేని రుణం అందిస్తున్నామని సీఎం వివరించారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 15,03,558 మంది కుటుంబాలకు బ్యాంకుల ద్వారా అందించిన వడ్డీ లేని రుణాలు రూ.2011 కోట్లు అందజేసినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు... 34 లక్షల మందికి ఈ రకంగా తోడ్పాడు ఇచ్చే కార్యక్రమం చేస్తుంటే.. ఒక్క మన రాష్ట్రంలోనే అందులో సగభాగం 15.03 లక్షల మందికి బ్యాంకుల సహకారంతో మంచి చేయగలిగామన్నారు. అలాగే ఇప్పటివరకు సకాలంలో రుణాలు చెల్లించిన 12.50 లక్షల మంది లబ్ధిదారులకు మన ప్రభుత్వం పూర్తిగా వడ్డీ భారాన్ని మోస్తూ.. తిరిగి చెల్లించిన మొత్తం రూ.48.48 కోట్లు అని తెలిపారు. జగనన్న తోడు ద్వారా లబ్ధి పొందినవారిలో 80శాతం మంది అక్క చెల్లెమ్మలే కావడం మరో విశేషంగా సీఎం పేర్కొన్నారు. ఇది మహిళా సాధికారితకు, సామాజిక న్యాయానికి కూడా నిదర్శనమన్నారు. రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాల నాయుడు, ఆదిమూలపు సురేష్, సీఎస్ సమీర్ శర్మ, గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'సీడ్స్' మూసివేత

- కార్మికులకు అండగా సీఎం జగన్
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు
- పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై ఉన్నతస్థాయి కమిటీ
- రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి అమర్‌నాథ్

విశాలాంధ్ర-అనకాపల్లి: అచ్యుతాపురం బ్రాండిక్స్ ఆవరణలోని సీడ్స్ పరిశ్రమలో మంగళవారం జరిగిన గ్యాస్ లీక్ ప్రమాదంలో అస్వస్థతకు గురై అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్ బుధవారం పరామర్శించారు. ఇతర ఆరోగ్య పరిస్థితులపై డీఎం అండ్ హెచ్‌ఓ హేమంత్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్ కుమార్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు పూర్తిగా నయం అయ్యేవరకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కంపెనీలో మంగళవారం రాత్రి వెలువడిన విషవాయువుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే బాధితులతో మంత్రి అమర్నాథ్ స్వయంగా మాట్లాడి ఘటన జరిగినప్పటి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం తాము క్యాంటీన్‌కు వెళ్తున్నప్పుడు కాలిన వాసన వెలువడిందని అప్పటికే తమకు కళ్లు తిరిగి, వాంతులు అవడంతో వెంటనే పనిచేస్తున్న స్థలానికి వచ్చేశామని చెప్పారు. మరికాసేపట్లో అందరూ కళ్లు తిరిగి పడిపోయామని చెప్పుకొచ్చారు. వెంటనే యాజమాన్యం తమను ఆసుపత్రికి తరలించిందన్నారు. దీనిపై మంత్రి అమర్నాథ్ స్పందిస్తూ ఎటువంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, పూర్తిగా నయమయ్యేవరకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ సీడ్స్‌లో ఇటువంటి సంఘటన రెండోసారి జరగడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తోందని, దాదాపు 121 మంది అస్వస్థతకు గురైనట్లు తెలిసిందన్నారు. ఘటన గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్ వెంటనే బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారన్నారు. గతంలో కూడా ఈ కంపెనీలో గ్యాస్ లీకైనప్పుడు అందుకు గల కారణాలు తెలుసుకునేందుకు ఒక కమిటీని వేశామని, అందులో జిల్లా స్థాయి అధికారులు, పరిశ్రమల శాఖకు చెందిన అధికారులు, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఉన్నారని చెప్పారు. ఈ కమిటీ సీడ్స్ నుంచి కొన్ని నమూనాలు సేకరించి పరీక్షించగా అందులో కాంప్లెక్స్ గ్యాస్ ఉన్నట్టు ప్రాథమిక నిర్ధారణకు వచ్చిందన్నారు. పెస్ట్ కంట్రోల్‌కు వాడే క్రిమిసంహారక మందు ఏసీ యంత్రాల్లోకి వెళ్లిందని ఏసీ యంత్రాలను వినియోగిస్తున్నప్పుడు అందులో నుంచి ప్రమాదకర వాయువు బయటకు వచ్చిందని దీనివల్ల అప్పుడు అక్కడ పనిచేస్తున్న కార్మికులు అస్వస్థతకు గురయ్యారని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు మంత్రి అమర్నాథ్ తెలియజేశారు. ఈ నివేదిక ఆధారంగా కంపెనీ యాజమాన్యానికి సెక్షన్ 41 కింద జూన్ 30న షోకాజ్ నోటీసులు జారీ చేశామని రెండు నెలల్లో ఈ నోటీసుకు సమాధానం ఇవ్వకుంటే ప్రాసిక్యూట్ చేస్తామని హెచ్చరించామని మంత్రి అమర్నాథ్ చెప్పారు. సంబంధిత యాజమాన్యం దీనిపై స్పందించాల్సి ఉందన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని ప్రమాదకర పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలపై ఉన్నతస్థాయి కమిటీ వేసి సేఫ్టీ ఆడిట్ జరిపిస్తామని చెప్పారు. అస్వస్థతకు గురైన వారు ఆరోగ్యపరంగా ఏ విధమైన ఇబ్బందులు పడతారన్న విషయమై స్పష్టత వచ్చేందుకు ఐ.సి.ఎం.ఆర్ రాశామని చెప్పారు. ఈలోగా ఇక్కడే మరో ఘటన జరగడంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ, ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలిసినంతవరకు కంపెనీని మూసి వేయాల్సిందిగా ఆదేశించారన్నారు. సీడ్స్ కంపెనీలో జరిగిన ప్రమాదాలకు కంపెనీ యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని మంత్రి అమర్నాథ్ స్పష్టం చేశారు. కంపెనీ మూత పడడం వల్ల కార్మికులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# కోస్తాకు కోత ముప్పే

## ఇరవై శాతంపైనేనని కేంద్ర మంత్రి స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర కోత ముప్పు ఎదుర్కొంటున్న తీర ప్రాంతం 20 శాతం పైనే ఉన్నట్లుగా ఇంకాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్) అధ్యయనంలో తేలినట్లు హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు. రాజ్యసభలో బుధవారం వైసీపీ సభ్యుడు వీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. రాష్ట్రంలోని 43.35 శాతం తీరానికి అతి తక్కువగాను, 33.27 శాతం తీరానికి ఓ మోస్తరు కోత ముప్పు ఉన్నట్లుగా ఇన్‌కాయిస్ అధ్యయనం పేర్కొనట్లు తెలిపారు. కోత ముప్పు అతి తీవ్రస్థాయిలో ఉన్న ప్రాంతం 0.55 శాతం ఉన్నట్లు చెప్పారు. సముద్రమట్టం పెరగకుండా నియంత్రించే చర్యల కోసం జాతీయ విపత్తు ఉపశమన నిధి (ఎన్డీఎంఎఫ్)కి 15 వేల కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. దీనికి అదనంగా తీరప్రాంత కోత వలన నిరాశ్రయులైన వారికి పునరావాసం కల్పించేందుకు జాతీయ విపత్తు సహాయ నిధి నుంచి మరో వేయి కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. జాతీయ స్థాయిలో నేషనల్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని 15వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సులకు అనుగుణంగా ఈ సంస్థను నెలకొల్పి 2021-22 నుంచి 2025-26 కాలానికి ఈ సంస్థకు 68 వేల 463 కోట్ల రూపాయలు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధిని ఎన్డీఆర్ఎఫ్, ఎన్డీఎంఎఫ్ సంస్థలకు 80-20 నిష్పత్తిలో విభజించామన్నారు.

కేంద్ర ప్రభుత్వం 2021 ఫిబ్రవరిలో ఎన్‌డీఎంఎఫ్‌ను నెలకొల్పింది. ఇలాంటి సంస్థలనే ఎస్‌డీఎంఎఫ్ పేరిట ఏర్పాటు చేయవలసిందిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చిన సలహా మేరకు ఇప్పటికి 21 రాష్ట్రాలు ఎస్‌డీఎంఎఫ్‌లను ఏర్పాటు చేశాయని మంత్రి వివరించారు. సముద్ర కోతల వలన తీర ప్రాంతాలకు ఎదురవుతున్న ముప్పును దీటుగా ఎదుర్కొనేందుకు ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ అధ్వర్యంలోని సంస్థలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు అందిస్తూ సాంకేతికపరమైన పరిష్కార మార్గాలను సూచిస్తున్నాయని ఆయన చెప్పారు.

**కేంద్ర సాయుధ పోలీసు దళాల ఉద్యోగాల్లో రిజర్వేషన్లు**

కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో ఉద్యోగాల భర్తీ రిజర్వేషన్ విధానాన్ని అనుసరించే జరుగుతుందని మరో ప్రశ్నకు సమాధానంగా నిత్యానంద్ రాయ్ తెలిపారు. సైనిక దళాల్లో ఉద్యోగాల భర్తీ కుల ప్రాతిపదికన జరగదని చెప్పారు. అయితే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఆర్థికంగా వెనకబడ్డ తరగతులకు కల్పించిన రిజర్వేషన్ ప్రాతిపదికపైనే ఉద్యోగ ఖాళీల భర్తీ జరుగుతుంది. షెడ్యూల్డ్ కులాల కోటాలో భర్తీ కాకుండా మిగిలిపోయిన ఖాళీలను తదుపరి నిర్వహించే నియామకంలో భర్తీ చేస్తామని మంత్రి తెలిపారు.

# ఆత్మ నిర్భర భారత్ ఇదేనా?

## సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్

న్యూదిల్లీ: ఖాదీతో తయారు చేసే జెండాలకు భిన్నంగా యంత్రాలను వినియోగించి పాలిస్టర్‌తో తయారు చేసిన త్రివర్ణ పతాకాల వినియోగం, దిగుమతులకు అనుమతిస్తూ ఫ్లాగ్ కోడ్ నింబంధనల్ని మార్చడాన్ని సీపీఐ రాజ్యసభ ఎంపీ సంతోశ్ కుమార్ తప్పుబట్టారు. మన త్రివర్ణ పతాకం తరహాలోనే దేశీయ ఖాదీ పరిశ్రమ కూడా జాతీయవాదానికి ప్రతీక అని తెలిపారు. సంతోశ్‌కుమార్ రాజ్యసభలో మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో విదేశీవస్తు బహిష్కరణ పేరుతో సాగిన ఖాదీ ఉద్యమం కీలకమని గుర్తుచేశారు. దేశమంతటా జాతీయవాదాన్ని వ్యాప్తి చేయడానికి ఖాదీ పరిశ్రమ ఎంతో కృషి చేసిందని తెలిపారు. చేనేత మగ్గంపై జాతీయ జెండాను తయారు చేసి ఎగురవేయడం ప్రాధాన్యత పొందిందని చెప్పారు. ఇటువంటి ఘనచరిత్రను మరచిన కేంద్రం ఖాదీ జెండాలతో పాటు పాలిస్టర్ జెండాల తయారీకి, దిగుమతులకు అనుమతి ఇవ్వడం జాతీయ ఉద్యమ వారసత్వాన్ని అవమానించడమేనని విమర్శించారు. మోదీ ప్రభుత్వం పాలిస్టర్ జెండాలను వినియోగించేలా ప్రోత్సహించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. దేశంలోని 1.4 కోట్ల మంది చేనేత కార్మికులు పనిలేక, ఆకలితో అలమటిస్తుంటే వారి జీవన భృతిని ప్రభుత్వ నిర్ణయం దెబ్బకొట్టిందని చెప్పారు. దేశీయంగా ఉన్న 2,398 ఖాదీ యూనిట్లలో జెండాలను తయారు చేయించడం వదిలేసి పాలిస్టర్ జెండాలను దిగుమతి చేసుకోవడానికి అనుమతించిన మోదీ ప్రభుత్వం... ఆత్మనిర్భర్ భారత్ పేరుతో డ్రామాలు ఆడుతోందని చురకలంటించారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో పాలిస్టర్ జెండాలు దిగుమతికి అనుమతించడం అంటే జాతీయ జెండాను, దాని చరిత్రను అవమానించడమేనని స్పష్టం చేశారు. తక్షణమే ఫ్లాగ్ కోడ్‌లో చేసిన సవరణలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండు చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.